మంగళవారం
17-01-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 205
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

నేపాల్‌లో ఘోర విమాన ప్రమాదం

నేపాల్‌లోని పాఖారా అంతర్జాతీయ విమానాశ్రయ సమీపంలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. విమానంలో ఉన్న వారిలో ఎవ్వరూ ప్రాణాలతో మిగల్లేదు. నలుగురు సిబ్బంది సహా 72 మంది మృత్యువాత పడ్డారు. విమానం కుప్పకూలిన వెంటనే ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి.

2లో

ఉద్యోగులకు

జగన్ ఝలక్

- సంక్రాంతికి డీఏ హామీ దగానే!
- పెండింగ్‌లో 4 డీఏలు
- ప్రతి ఉద్యోగికీ రూ.10వేల బకాయి
- నిలిచిన రూ.3వేల కోట్ల ప్రయోజనాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లపై జగన్ సర్కారు దగాకోరు విధానాల్ని కొనసాగిస్తోంది. సంక్రాంతి పండుగకు కనీసం ఒక్క డీఏ ఇస్తామంటూ సీఎం జగన్ సమక్షంలో ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. ఎంతో కాలంగా డీఏల కోసం నిరీక్షిస్తున్న ఉద్యోగులకు ఇది చేదు కబురైంది. పండుగనాడు వారి ఖాతాల్లో ఒక్క రూపాయి కూడా జమవకపోవడంతో తీవ్ర నిరుత్సాహం చెందారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 13లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు ఉన్నారు. ప్రస్తుతం ఉద్యోగులకు 2021 జనవరి, 2021 జులై, 2022 జనవరి, 2022 జులైకి సంబంధించి నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. 2023 జనవరితో కలిపి ఐదవుతాయి. ఇందులో కనీసం ఒక్క డీఏ కూడా సంక్రాంతికి ఇవ్వకుండా జగన్ ప్రభుత్వం దగా చేసిందని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు ధ్వజమెత్తుతున్నాయి. డీఏల రూపంలో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు కలిపి (ఒక్కో డీఏకు రూ.2,500)రూ.10వేల చొప్పున రావాల్సి ఉంది. ఈ ఏడాది కేంద్రం కొత్త డీఏ ప్రకటిస్తే, దాంతో కలిపి ఒక్కొక్కరికీ రూ.2,500 చొప్పున డీఏ ప్రయోజనం ఉపాధ్యాయులకు చెందాల్సి ఉంది.

రూ.1800కోట్ల పీఆర్సీ బకాయిలు
దీనికితోడు ఉద్యోగ, ఉపాధ్యా, కార్మిక, పెన్షనర్లు అందరికీ పీఆర్సీ బకాయిలు రూ.1800 కోట్లు రావాల్సి ఉంది. సగటున ప్రతి ఉద్యోగికి పీఆర్సీ ప్రయోజనాల్ని పరిశీలిస్తే రూ.లక్ష నుంచి 2లక్షలు రావాల్సి ఉంది. జిల్లా పరిషత్(జెడ్పీ)

- మిగతా 2 లో

కోడి కత్తి కొట్లాట

చేతులు మారిన కోట్లు

సంప్రదాయ క్రీడలకు సమాధి

- పోలీస్ పవర్‌కు బ్రేక్
- రెచ్చిపోయిన ప్రజాప్రతినిధులు
- చోద్యం చూస్తున్న ప్రభుత్వం
- నెత్తురోడిన బరులు
- కోట్లు నొక్కేసిన నిర్వాహకులు
- నెత్తిన చెంగేసుకున్న కష్టజీవులు
- రక్తచరిత్రపై జంతుప్రేమికుల ధ్వజం

విశాలాంధ్ర-డిజిటల్:
న్యాయదేవత కళ్లకు గంతలు కట్టారు... సంప్రదాయ కోడిపందేలకు సమాధి కట్టారు... పోలీసు పవర్‌కు పాతరేశారు... బొబ్బిలి పుంజును మించి కట్టలు తెగిన కోపంతో అధికారులపై అధికార పార్టీ నాయకులు నోరుజారి కత్తులు కట్టించి మరీ బరుల్లో కోడిపందేలకు తెరతీశారు. అడ్డొచ్చిన రక్షకభటులపై చిందులేశారు... ఆనక అంతు చూస్తామన్నారు... తమ అధికారం ముందు న్యాయస్థానం ఆదేశాలు దిగదుడుపేనని పాలకులు నిరూపించారు. అనాదిగా సంస్కృతి, సంప్రదాయాలకు నెలవైన సంక్రాంతి సంబరాలను కొత్తపుంతలు తొక్కిస్తూ రక్త చరిత్ర సృష్టిస్తున్నారు. సంప్రదాయాల ముసుగులో జూదాలు, గుండాటలకు దన్నుగా నిలుస్తూ పేదల కష్టార్జితాన్ని తన్నుకుపోతున్నారు. రాజకీయ అండతో ఒక్కో బరిని లక్షలాది రూపాయలకు తమ గుప్పెట్లో పెట్టుకున్న నిర్వాహకులు బహిరంగ దోపిడీకి పాల్పడుతున్నారు. కత్తియుద్ధం చేస్తూ ఓ వైపు 'పుంజు' రాజాలు నేలకొరుగుతుంటే మరోవైపు బరిలో ఏరులై పారుతున్న రక్తాన్ని చూస్తూ పందెం రాయుళ్లు కేరింతలు కొడుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలంలో విధుల్లో భాగంగా గుండాటను అడ్డుకునేందుకు తన సిబ్బందితో వెళ్లిన ఎస్సైపై ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆగ్రహంతో విరుచుకుపడటం ఓ మచ్చుతునక.

ప్రభుత్వాలు ఏవైనా... కోడిపందేలకు పెట్టింది పేరైన ఆంధ్రప్రదేశ్‌లోని ఉభయ గోదావరి జిల్లాల్లో నాయకుల ఒత్తిళ్లకు అధికార యంత్రాంగం తలవంచాల్సిందే. నిబంధనలకు లోబడి నిజాయతీ అధికారులు ఎవరైనా హెచ్చరికచేస్తే... గోడకు కొట్టిన బంతిలా 'బరి'కి తగిలి వెనక్కి వెళ్లాల్సిందే. బతుకుదెరువు కోసం కొలువులో చేరాం... బరుల జోలు మనకెందుకులే అన్నంతగా వారికున్న అధికారాన్ని ప్రభుత్వం తగ్గించేస్తోంది. దీంతో చోటామోటా నేతల నుంచి మంత్రిస్థాయి నాయకుడి వరకూ రెచ్చిపోతున్నారు. మకర సంక్రాంతినాడే రూ.100 కోట్ల పైబడి చేతులు మారాయంటే జూద క్రీడ ఏ స్థాయిలో దూసుకుపోతోందో నిరక్షరాస్యుడికి సైతం ఇట్టే అర్థమవుతోంది. మూడు రోజుల్లో సుమారు వందలాది కోట్లకు పైగా దోపిడీ వ్యాపారం జరిగినట్టు సమాచారం. బరుల వద్ద పెద్ద పెద్ద ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి, ఫ్లడ్ లైట్ల విద్యుత్ కాంతుల నడుమ పగలూ, రాత్రి అన్న తేడా లేకుండా పందేలు నిర్వహిస్తుండటంతో రూ.లక్షల్లో కోళ్లపై పందేలు కడుతూ కొందరు కుబేరులవుతుండగా, మరికొందరు నెత్తిన చెంగేసుకొని తేలుకుట్టిన దొంగల్లా పోతున్నారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. మందు, విందు, లోన-బైట, గుండాట, చిత్తులాట, పేకాట, పెద్దబజార్-చిన్నబజార్, లక్కీ డ్రా ఇలా... నిషిద్ధ క్రీడలను ప్రోత్సహిస్తూ కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారని చెబుతున్నారు. కౌంటర్ ఒక్కింటికి రూ.రెండు వేల టేబుల్, ఐదు వేల టేబుల్ అని పిలిచి మరీ జేబులు ఖాళీ చేస్తున్నారని చెప్పారు. సరదా కోసం వెళ్లిన కష్టజీవులు... జూదగాళ్ల మాయమాటలకు చిక్కి ఉన్నదంతా పోగొట్టుకొని చేతిలో చిల్లి గవ్వ లేకుండా నడకతో ఇంటిదారి పడుతున్నారని తెలిసింది. యేటా మాదిరిగానే ఈ ఏడాదీ తెలంగాణ నుంచి పందెంరాయుళ్లు ఆంధ్రాకు క్యూ కట్టడంతో బరులన్నీ ఉభయ కృష్ణా జిల్లాతో పాటు కోనసీమ జిల్లాలన్నీ మూడు పుంజులు ఆరు పందేలన్నట్టుగా కిటకిటలాడాయి. పందేల ప్రాంగణంలోకి ఎవరైనా ఉత్సాహవంతులు అడుగిడాలంటే రూ.20, కోడి బరిలోకి వెళ్లాలంటే రూ.100, కోడిని

- మిగతా 2 లో

ఖజానాకు కిక్కు

- జోరుగా మద్యం విక్రయాలు-కలిసొచ్చిన జనవరి
- సంక్రాంతికి రూ.300 కోట్లకుపైనే ఆదాయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
రాష్ట్ర ప్రభుత్వానికి జనవరి మాసం కలిసొచ్చింది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వేళ మద్యం అమ్మకాల రూపంలో కాస్తంత ఉపశమనానిచ్చింది. కొత్త సంవత్సరం సందర్భంగా రికార్డు స్థాయిలో రూ.142 కోట్ల విలువైన మద్యాన్ని మందుబాబులు తాగేశారు. రాష్ట్ర ఖజానా దివాళా తీసిన పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రత్యేకంగా నూతన సంవత్సరం వేడుకలను పురస్కరించుకుని డిసెంబరు 31వ తేదీ వైన్ షాపులలో అర్ధరాత్రి 12 గంటల వరకు, బార్ అండ్ రెస్టారెంట్లలో ఒంటి గంట వరకు మద్యం విక్రయాలకు అనుమతిచ్చింది. దీంతో మందుబాబులు ఆ రోజంతా మద్యంలో మునిగి తేలారు. ఒక్కరోజే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో రూ.127 కోట్లు, బార్ అండ్ రెస్టారెంట్లలో రూ.15కోట్ల విలువైన మద్యం తాగారు. సాధారణంగా మద్యం అమ్మకాలు రాష్ట్రవ్యాప్తంగా రూ.70 కోట్ల వరకు సాగుతుంటాయి. అటువంటిది కొత్త సంవత్సరం వేడుకలప్పుడు రెట్టింపు అమ్మకాలు జరిగాయి. అలాగే సంక్రాంతి పండుగ సందర్భంగా మూడు రోజుల్లో రూ.300 కోట్లపైనే మద్యం అమ్మకాలు సాగినట్లు ఎక్సైజ్ అధికారులు చెప్పారు. సంక్రాంతికి అనేకమంది స్వగ్రామాలకు చేరుకుంటారు. అలాగే ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పెద్దఎత్తున నిర్వహించే కోడి పందాలను తిలకించేందుకు ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తారు. ఈఏడాది అధికార పార్టీ నేతలు స్వయంగా శిబిరాలు ఏర్పాటు చేసి యథేచ్ఛగా కోడి పందాలు నిర్వహించారు. శిబిరాల వద్ద మద్యం అమ్మకాలు అనధికారికంగా జోరుగా సాగాయి. దీంతో ఉభయగోదావరి జిల్లాల్లో రూ.30కోట్లకుపైగా అమ్మకాలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా రూ.300కోట్ల విలువైన మద్యాన్ని మందుబాబులు తాగేశారు. వీటిలో ఒక వంతు బీర్లు అమ్మకాలున్నట్లు అధికారులు తెలిపారు.

కొలీజియంలో ప్రభుత్వానికి ప్రాతినిధ్యం

కేంద్ర మంత్రి రిజిజు

న్యూదిల్లీ:
సర్వోన్నత న్యాయస్థానంతో పాటు ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల నియామకాలలో ప్రభుత్వానికి సముచిత పాత్ర ఉండాలని కేంద్ర న్యాయమంత్రి కిరణ్ రిజిజు నొక్కి చెప్పారు. జాతీయ న్యాయ నియామకాల కమిషన్ చట్టాన్ని (ఎన్‌జేఏసీ) కొట్టివేసినప్పుడు కొలీజియం వ్యవస్థ ఎంఓపీలను మరలా రూపొందాలని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం చేసిన సూచనల మేరకు కొలీజియం వ్యవస్థలో ప్రభుత్వానికి ప్రాతినిధ్యం కోరుతున్నట్లు వెల్లడించారు. ఇదే విషయంలో ఆయన తాజాగా సీజేఐ డీవై చంద్రచూడ్‌కు లేఖ పంపారు. రాజ్యాంగానికి ఏదీ అతీతం కాదని, దానికి కట్టుబడాలని, రాజ్యాంగానికి విరుద్ధంగా కొలీజియం పనితీరు ఉన్నదని విమర్శించారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులను సుప్రీంకోర్టు, హైకోర్టుల కొలీజియాల్లో చేర్చడం వల్ల న్యాయమూర్తుల

- మిగతా 2 లో

ఇళ్ల సమస్యలపై నేటి నుంచి

లబ్ధిదారులతో భేటీలు

- జగనన్న కాలనీ ఇళ్లకు రూ.5 లక్షలు ఇవ్వాలి
- టిడ్కో ఇళ్లు స్వాధీనం చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
జగనన్న కాలనీలలో నిర్మించే ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున డబ్బు ఇవ్వాలని, టిడ్కో గృహ సముదాయాలకు మౌలిక వసతులు కల్పించి, తక్షణమే లబ్ధిదారులకు స్వాధీనపరచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17వ తేదీ మంగళవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి, అర్జీలపై సంతకాలు సేకరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ...పేదల కోసం ఇళ్లస్థలాలు కేటాయించిన ప్రభుత్వం ఇళ్లు కూడా నిర్మిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఆ తర్వాత లబ్ధిదారులే గృహ నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.1.80 ఇస్తోందని తెలిపారు. ఆయా స్థలాలలో వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని, లేనిపక్షంలో లబ్ధిదారుల పట్టాలను రద్దు చేస్తామని బెదిరిస్తోంది. ఒక కుటుంబానికి ఏమాత్రం నివాసయోగ్యం కాని విధంగా కేవలం సెంటు స్థలం కేటాయించారని, పట్టణాలకు, పని ప్రాంతాలకు సుదూరంగా కొండలు, గుట్టలు, చెరువులు, ముంపు ప్రాంతాలలో పేదలకు ఇళ్లస్థలాలు కేటాయించడంతో ఆయా ప్రాంతాలలో ఇళ్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్ల చొప్పున ఇళ్లస్థలాలు కేటాయించాలని సీపీఐ డిమాండ్ చేసినప్పటికీ జగన్ సర్కార్ పెడచెవిన పెట్టిందని విమర్శించారు. జగనన్న కాలనీలలో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు ఇప్పటివరకూ కల్పించలేదని, ఒక్కో ఇంటికి ప్రభుత్వం ఇచ్చే రూ.లక్షా 80వేలు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఒక్కశాతం మంది చేతిలో

40 శాతం సంపద

- పెరిగిన బిలియనీర్ల సంఖ్య
- రెండేళ్లలో సంపన్నుల జాబితాలోకి 64 మంది
- 35 కోట్లకు చేరిన పేదలు
- కోవిడ్ తర్వాత కుబేరుల ఆస్తులు 121 శాతంపైకి: ఆక్స్‌ఫామ్ నివేదిక వెల్లడి

దావోస్:
భారతదేశంలో ధనికులకు, పేదలకు మధ్య అంతరం అంతకంతకూ పెరుగుతోంది. కోటీశ్వరులు, అత్యంత ధనికులు మరింత సంపద పోగేసుకుని బిలియనీర్లుగా మారుతుంటే, పేదలు మరింత పేదలుగా మారుతున్నారని, ఈ అంతరాన్ని తగ్గించాలంటే

- మిగతా 2 లో

మాకు దిక్కేది?

- ఎన్నికల్లో లబ్ధికే అమిత్ షా అయోధ్య జపం
- అందుకే రోడ్డు విస్తరణ పనులు
- పరిహారం ఇవ్వని ప్రభుత్వం
- జీవనాధారం కోల్పోయిన దుకాణదారులు
- యోగి ప్రభుత్వంపై ఆగ్రహజ్వాల

2లో

నేపాల్‌లో ఘోర విమాన ప్రమాదం

68 మృతదేహాలు లభ్యం

- మిగతా నలుగురి కోసం గాలింపు
- ఐదుగురు భారతీయులు సహా 72 మంది మృతి

ఖాట్మండు: నేపాల్‌లోని పొఖారా అంతర్జాతీయ విమానాశ్రయ సమీపంలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. విమానంలో ఉన్న వారిలో ఎవ్వరూ ప్రాణాలతో మిగల్లేదు. నలుగురు సిబ్బంది సహా 72 మంది మృత్యువాత పడ్డారు. విమానం కుప్పకూలిన వెంటనే ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. నల్లటి పొగమంచు ఆ ప్రాంతాన్ని కమ్మేసిందని, విస్ఫోటనం జరిగినట్లుగా పెద్ద శబ్దం వినిపించిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో 72 మంది మరణించినట్లు విమానాయన సంస్థ ప్రతినిధి పెంబా షెర్పా ధ్రువీకరించారు. 68 మంది ప్రయాణికులతో పాటు నలుగురు సిబ్బంది మరణించారని, 68 మృత దేహాలు లభ్యమయ్యాయని అధికారులు వెల్లడించారు. యతీ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఏటీఆర్ 72 ప్యాసింజర్ ట్విన్‌ఇంజిన్ విమానం ఖాట్మండు నుంచి పొఖారాకు బయల్దేరి వెళ్లగా దిగేందుకు కొద్ది నిమిషాల ముందు ప్రమాదం జరిగినట్లు స్పుత్నిక్ వార్తాసంస్థ వెల్లడించింది. చనిపోయిన వారి జాబితాను పౌర విమానాయాన శాఖ వెలువరించింది. మృతుల్లో 53 మంది నేపాలీలు ఉండగా 15 మంది విదేశీయులు ఉన్నారు. వీరిలో ఐదుగురు భారతీయులు, నలుగురు రష్యన్లు, ఇద్దరు కొరియన్లు అర్జెంటైనా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, ఐర్లాండ్‌కు చెందిన వారు ఒక్కొక్కరు ఉన్నట్లు జాబితా తెలిపింది. ప్రమాదానికిగల కారణాలను అన్వేషించేందుకు ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు నేపాల్ అధికారులు వెల్లడించారు. 45 రోజుల్లో నివేదిక వెలువడనున్నట్లు సమాచారం. ఈఘటన ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో జరిగింది. దీంతో రాత్రి మొత్తం సహాయక చర్యలు కొనసాగాయి. రంగంలోని దిగిన సైన్యం తాళ్ల సాయంతో వెయ్యి అడుగుల లోయలోకి దిగి మృతదేహాల కోసం గాలించింది. మొత్తం 68 మృతదేహాలను వెలికితీయగా, మరో నాలుగు లభ్యం కావాల్సి ఉన్నట్లు సీనియర్ అధికారి టేక్ బహదూర్ తెలిపినట్లు ఏఎఫ్‌పీ వార్తాసంస్థ పేర్కొంది. విమానం శిధిలాలు ఆ ప్రాంతంలో చెల్లాచెదురుగా పడి వున్నాయి. ఈ విమానాన్ని గతంలో కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ నడిపినట్లు తెలిసింది.

అసమానతలు తగ్గిద్దాం

ప్రపంచ ఆర్థిక ఫోరం ప్రారంభోత్సవంలో ఆక్స్‌ఫామ్ పిలుపు

దావోస్: ప్రపంచ ఆర్థిక ఫోరం (డబ్ల్యూఈఎఫ్)-2023 సదస్సు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో సోమవారం మొదలైంది. ఈనెల 20వ తేదీ వరకు 'విచ్ఛిన్నమైన ప్రపంచానికి సహకారం' నినాదంతో ఈ సదస్సు జరగనున్నది. ఉక్రెయిన్- రష్యా యుద్ధం వల్ల నెలకొన్న సంక్షోభం, ప్రపంచ స్థాయి ద్రవ్యోల్బణం, వాతావరణ మార్పు వంటి కీలకాంశాలను ప్రపంచ దేశాల నేతలతో పాటు పారిశ్రామిక వేత్తలు, నిపుణులు, విద్యావేత్తలు, పెట్టుబడిదారులు, రాజకీయ, వ్యాపార నాయకులు చర్చిస్తారు. భారత్ నుంచి కొందరు కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, పారిశ్రామిక వేత్తలలతో పాటు ఎస్‌బీఐ చైర్మన్, కార్పొరేట్ సంస్థల సీఈవోలు సదస్సుకు హాజరైనట్లు తెలిసింది.

2030 నాటికి ప్రపంచ బిలియనీర్ల సంఖ్య-సంపద సగానికి తగ్గించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని ప్రపంచ దేశాలకు ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ పిలుపునిచ్చింది. అందుకోసం ఆర్థిక పన్నులు తదితర విధానాలను అనుసరించాలని సూచించింది. బిలియనీర్లు తమ సంపదను పదేళ్లలో రెట్టింపు చేసుకున్నారని తెలిపింది. ఒక శాతంగా ఉన్న సంపన్నులు దిగువ స్థాయిలోని 50 శాతం మంది కంటే 74 రెట్లు ఎక్కువ సంపాదించారని పేర్కొంది. కోవిడ్ మహమ్మారి, ఉక్రెయిన్- రష్యా యుద్ధం నేపథ్యంలో ఆహారం- ఇంధన అధిక ధరల వల్ల తలెత్తిన జీవ-వ్యయ సంక్షోభం మధ్య చాలా మంది సంపన్నుల సంపద పెరిగినట్లు ఆక్స్‌ఫామ్ పేర్కొంది. 2020 నుంచి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 1.7 బిలియన్ల సంపద రోజుకు 2.7 బిలియన్ డాలర్ల లెక్కన పెరిగిందని, అధిక ద్రవ్యోల్బణం ఉన్నాగానీ సంపద పెరిగినట్లు ఆక్స్‌ఫామ్ తెలిపింది. ఫుడ్ అండ్ ఎనర్జీ కంపెనీలు గతేడాది తమ లాభాలను రెట్టింపు కంటే ఎక్కువగా పెంచుకున్నాయని పేర్కొంది. సంపద సమం చేయాలని, తీవ్రంగా ఉన్న అసమానతలను తగ్గించాలని, ఇందుకోసం ప్రగతిశీలమైన రేట్లకు పన్నులు విధించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని ఆక్స్‌ఫామ్ నొక్కిచెప్పింది. 2030 నాటికి బిలియనీర్ల సంపదను-సంఖ్యను సగం చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్లాలని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చింది. ఇందుకోసం తగిన విధానాలను అనుసరించాలని, అంతా అనుకున్నట్లే జరిగితే బిలియనీర్ల సంపద-సంఖ్య 2012 నాటికి ఉన్న స్థాయికి చేరుతాయని ఆక్స్‌ఫామ్ పేర్కొంది. బిలియనీర్లు తమ సంపదను విపరీతంగా పెంచుకుంటూ పోయే పద్ధతికి అడ్డుకట్ట అనివార్యమని సూచించింది. వన్-ఆఫ్ సాలిడరిటీ' సంపద, 'విండ్‌ఫాల్ పన్నుల' అమలుతో 'క్రైసిస్ ప్రాఫిటరింగ్'ను నిరోధించవచ్చని పేర్కొన్నది. కనీసం 60శాతం మూలధనంపై పన్ను, ఒక్కశాతంగా ఉన్న సంపన్నులపై శాశ్వత పన్ను ఉండాలని ఆక్స్‌ఫామ్ సూచించింది. ఇదే క్రమంలో అమెరికా దర్యాప్తు వార్తాసంస్థ ప్రోపబ్లికా నివేదికను ప్రస్తావించింది. ప్రపంచ సంపన్నుల్లో అత్యధికులు పన్నులు చెల్లించబోరని వెల్లడించింది. 2014-18లో 3.2శాతం 'ట్రూ టాక్స్ రేట్'ను టెస్లా యజమాని ఎలన్ మస్క్ చెల్లించగా అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ ఒక్కశాతం కంటే తక్కువ చెల్లించినట్లు ఆక్స్‌ఫామ్ తెలిపింది. తమతో కలిసి పనిచేసే ఉగాండా వ్యాపారి తనకు వచ్చే లాభాలలో 40శాతాన్ని పన్ను రూపంలో చెల్లిస్తున్నట్లు వెల్లడించింది.

న్యాయవ్యవస్థను ప్రభుత్వం బెదిరిస్తోంది: కాంగ్రెస్

న్యూఢిల్లీ: కొలీజియం వ్యవస్థలో ప్రభుత్వానికి ప్రాతినిధ్యం కోరుతూ సీజేఐ చంద్రచూడ్‌కు కేంద్ర న్యాయమంత్రి కిరణ్ రిజిజు లేఖ రాయడాన్ని కాంగ్రెస్ తప్పుపట్టింది. న్యాయవ్యవస్థను స్వాధీనంపర్చుకునే రీతిలో బెదిరింపులకు ప్రభుత్వం పాల్పడుతోందని వ్యాఖ్యానించింది. జడ్జీల ఎంపికలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందని చెప్పి కొలీజియంలో ప్రాతినిధ్యాన్ని రిజిజు కోరారు. ఉప రాష్ట్రపతి విమర్శలు చేశారు. న్యాయమంత్రి ఏకంగా కొలీజియం వ్యవస్థపై దాడి చేశారు. ఇదంతా న్యాయ వ్యవస్థను స్వాధీనం పర్చుకుంటామనే రీతిలో బెదిరించడమే అవుతుందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ట్వీట్ చేశారు.

చేతులు మారిన కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకెళ్లాలంటే రూ.500 ఇలా ప్రవేశ రుసుం వసూలు చేస్తూ పెద్దఎత్తున దోచుకుంటున్నారన్న ఆరోపణలు హల్‌చల్ చేస్తున్నాయి. సంప్రదాయ ముసుగులో పెద్దపెద్ద రాజకీయనేతలు... తమకు అనుచరులుగా ఉంటూనే విపక్ష పార్టీలో చేరిన తమ అనుంగులతో వెనకుండి బరులు నిర్వహిస్తున్నారన్న విమర్శలు జోరందుకున్నాయి. తనకు అన్యాయం జరిగిందని ఎవరైనా గొంతెత్తితే అణచివేసేందుకు ప్రైవేట్ సెక్యూరిటీగా బౌన్సర్లను నియమించుకున్నారంటే...దోపిడీ ఏ విధంగా చేస్తున్నారో ఇట్టే అర్థమవుతోంది. ఇదిలా ఉండగా, సంప్రదాయాల ముసుగులో ప్రభుత్వం తెరచాటున ఉండి ఇదంతా నడిపిస్తోందని జంతుప్రేమికులు అంటున్నారు. కోడిపుంజులకు కత్తులు కట్టకుండా సంప్రదాయబద్ధమైన విడిగాళ్ల పందెం వేస్తే జీవహింస ఉండదనీ, న్యాయస్థానం ఆదేశాలకు ముసుగేసి నిర్వాహకులకు వెన్నుదన్నుగా నిలుస్తున్న ప్రజాప్రతినిధులు ఇదంతా చేస్తున్నది తమ సొంత లాభం కోసమేనని ధ్వజమెత్తారు. ఓట్ల కోసం ప్రజలను మచ్చిక చేసుకోవడానికి రక్త చరిత్ర రాస్తున్నారని మండిపడ్డారు.

లబ్ధిదారులతో భేటీలు

(మొదటిపేజీ తరువాయి)

ఏమాత్రం సరిపోక లబ్ధిదారులు గందరగోళంలో ఉన్నారని పేర్కొన్నారు. ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మితమైన లక్షలాది టిడ్కో గృహాలను లబ్ధిదారులకు స్వాధీనపరచకుండా జగన్ ప్రభుత్వం తాత్సారం చేస్తోందని ఆరోపించారు. గూడు సమకూరుతుందన్న ఆశతో అప్పులు తెచ్చి డిపాజిట్లు కట్టిన లబ్ధిదారులు మూడున్నరేళ్లుగా టిడ్కో ఇళ్ల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. తక్షణమే టిడ్కో గృహ సముదాయాలకు మౌలిక సదుపాయాలు కల్పించి, లబ్ధిదారులకు స్వాధీనపరచాలని డిమాండ్ చేశారు. ఇళ్ల సమస్యపై 17వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలోని మండల, పట్టణ, నగరస్థాయిలలో లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి...సంతకాలు సేకరించాలని సూచించారు. సంతకాలతో కూడిన అర్జీలను జిల్లా కలెక్టర్లకు, సంబంధిత అధికారులకు సమర్పించాలని రామకృష్ణ పిలుపునిచ్చారు.

జగన్ ఝలక్

(మొదటిపేజీ తరువాయి)

పీఎఫ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ జీవిత బీమా(ఏపీ జీఎల్ఐ)కి చెందిన ప్రయోజనాలు, రుణాలు నిలిచిపోగా, ఏడాది నుంచి ఉద్యోగుల ఆర్జిత (సరెండర్) సెలవులు నిలిచి పోయాయి. మొత్తంగా పీఆర్సీ, డీఏ, ఆర్జిత సెలవులు తదితరాలు అన్నీ కలిపి ఉద్యోగులకు రూ.3వేల కోట్ల ప్రయోజనాలు పెండింగ్‌లో ఉండి పోయాయి. దీనిపై ప్రశ్నించిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలపై అణచివేతకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందనే విమర్శలున్నాయి. నాడు పీఆర్సీ ప్రయోజనాల కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు చేపట్టిన చలో విజయవాడ గర్జనతో ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరైంది. అప్పట్నుంచి ప్రత్యేకించి ఉపాధ్యాయుల ప్రయోజనాలను గాలికొది లేసింది. కనీసం సీఎంతో జరిగే ఉద్యోగ సంఘాల జేఏసీ సమావేశా లకు సైతం ఉపాధ్యాయ సంఘాలను ఆహ్వానించకుండా వివక్ష చూపు తోంది. ఉద్యోగుల డీఏ అనేది ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడింది కాదని అది తమ హక్కు అని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఎందుకీ నిర్లక్ష్యం?

ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రధాన భూమిక వహిస్తున్నారు. జగన్ ప్రభుత్వం అప్పులు చేసి సంక్షేమ పథకాల్ని కొనసాగిస్తూ, మరో వైపు ఆ సంక్షేమ పథకాలను నిర్వహణకు కృషి చేస్తున్న ఉద్యోగుల ప్రయోజనాలపై చిన్న చూపు చూస్తోంది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దుపైనా ఇప్పటివరకు ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. సీపీఎస్ రద్దును అమలు చేయకుండా, తెరపైకి గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) తెచ్చి ఉద్యోగ, ఉపాధ్యాయులను కొంతకాలంపాటు గందరగోళానికి గురిచేసింది. దానిపై పెద్దఎత్తున తిరుగుబాటు రావడంతో సీపీఎస్, జీపీఎస్ స్థాయిలో మధ్యేమార్గంగా మరో పెన్షన్ విధానం త్వరలో తీసుకొస్తామంటూ జగన్ ప్రభుత్వం దాటవేసింది. సీపీఎస్ రద్దు చేయాలంటూ లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉద్యమానికి సిద్ధమైతే, వారిపై జగన్ ప్రభుత్వం కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేసింది. నాడు చలో విజయవాడ విజయవంతానికి పరోక్షంగా సహకరించారన్న అక్కసుతో స్పెషల్ బ్రాంచి, నిఘా విభాగాలను వివిధ ప్రాంతాలకు ప్రభుత్వం బదిలీ చేసింది. ఉపాధ్యాయుల పదోన్నతుల్లోనూ ఇష్టానుసారంగా నిబంధనలను తీసుకొచ్చింది. మూడున్నరేళ్లుగా జగన్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు కన్నెర్రజేస్తున్నారు.

మాకు దిక్కేది?

అయోధ్య: అయోధ్యలో రామమందిర నిర్మాణం పేరుతో బీజేపీ ప్రభుత్వం స్థానిక దుకాణదారుల పొట్టకొడుతోంది. కనీస సమాచారం ఇవ్వకుండా...నష్టపరిహారం ఇవ్వకుండా దుకాణాలు, నివాసాలు కూల్చివేతపై ఆగ్రహం వెలిబుచ్చుతున్నారు. వచ్చే ఏడాది జనవరి 1న అయోధ్య రామ మందిరాన్ని ప్రారంభిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవల చేసిన ప్రకటన...అయోధ్యలోని స్థానిక దుకాణదారులు, చిరు వ్యాపారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. యోగి ప్రభుత్వంపై దుకాణదారులు మండిపడుతున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ఐదు నెలల ముందు రామ మందిరాన్ని ప్రారంభిస్తామని అమిత్ షా ప్రకటించడం... కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని, ఎన్నికల్లో లబ్ధి పొందడానికేనని నిప్పులు చెరిగారు. ఇదే సమయంలో మందిరం పనులు సకాలంలో పూర్తిచేయడానికి రోడ్డు విస్తరణను హడావుడిగా చేపడుతున్న బీజేపీ ప్రభుత్వం.. ధ్వంసమైన తమ దుకాణాలకు ఇచ్చే పరిహారం విషయంలో జాప్యం చేయడమేమిటని వాపోతున్నారు. మూడు దశాబ్దాలుగా ఇక్కడే దుకాణాలు నడుపుకొంటూ పొట్టపోసుకుంటున్నామని, ఉన్నట్టుండి దుకాణాలు తొలగిస్తే తమకు ఉపాధి ఎలా అని ప్రశ్నిస్తున్నారు. షాపులు కోల్పోయిన తమకు పరిహారం ఎక్కడ అని నిలదీస్తున్నారు.

అయోధ్య రామాలయం నిర్మాణంలో భాగంగా నగరంలోని రామ్‌పథ్ (13 కిలోమీటర్లు), శ్రీరామ్ జన్మభూమి పథ్ (800 మీటర్లు), భక్తిపథ్ (800 మీటర్లు) తదితర కీలక మార్గాల్లో రోడ్డు విస్తరణ పనులను ఉత్తరప్రదేశ్‌లోని యోగి ప్రభుత్వం చేపట్టింది. ఈ క్రమంలో వందలాది దుకాణాలు, ఇళ్లను తొలగించారు. అయితే, కొంతమందికి మాత్రమే కొద్దిమొత్తంలో పరిహారం చెల్లించిన బీజేపీ సర్కారు.. మిగతా వారి విజ్ఞప్తులను పట్టించుకోలేదు. దీంతో అన్నంపెట్టే దుకాణాలను కోల్పోయిన తాము బిచ్చమెత్తుకోవాలా అని లక్ష్మీకాంత్ తివారీ అనే చిరు వ్యాపారి మండిపడ్డారు. ఇళ్లు కోల్పోయిన బాధితులు కూడా ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్రిజ్ కిశోర్ పాండే అనే చిరు వ్యాపారి మాట్లాడుతూ మందిరాన్ని ప్రారంభిస్తున్నామని చెప్పడం తేలికేనని, అయితే, దీనివల్ల ఎందరి జీవితాలు చితికిపోయాయో గుర్తించాలని అన్నారు. దేవుడి చిత్రపటాలు, వస్తువులనే తాము అమ్ముతామని, ఇప్పుడు ఆ దేవుడి పేరు చెప్పే తమ జీవనాధారమైన దుకాణంతో పాటు ఇంటినీ కూల్చేశారని విమర్శించారు. ప్రధాని మోదీ, సీఎం యోగికి తాను మద్దతిచ్చానని, వాళ్ల హయాంలోనే బుల్డోజర్లు తమ ఇంటిమీదకు వస్తాయనుకోలేదని, తమకు రూ. లక్ష ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకున్నదన్నారు.

సమాజ్‌వాదీ పార్టీ నాయకులు పవన్ పాండే మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పేరిట స్థానికుల దుకాణాలు తొలగించి, గుజరాతీలకు కాంట్రాక్టులు కట్టబెట్టడానికి బీజేపీ వేసిన బృహత్ ప్రణాళిక ఇదని విమర్శించారు. పౌరుల భద్రత కోసం ప్రభుత్వం పనిచేయాలని, బీజేపీ హయాంలో ప్రజలు భయానికి గురవుతున్నారన్నారు.

ఆర్‌వీఎంలపై మరింత లోతుగా చర్చ

పయ్యావుల కేశవ్ సూచన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వలస కార్మికులను ఎన్నికల్లో భాగస్వామ్యం చేసేందుకు రూపొందించిన ఆర్‌వీఎం అమలుపై మరింత లోతుగా చర్చించాలని, అమలు వాయిదా వేయాలని తెలుగుదేశం పార్టీ నేతలు కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆర్‌వీఎంపై సోమవారం ఢిల్లీలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు సిద్ధం చేసిన రిమోట్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం పని తీరును వివరించేందుకు నిర్వహించిన ఈ సమావేశానికి దేశంలోని అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీలను ఆహ్వానించింది. ఆర్‌వీఎంలపై ఇప్పటికే పార్టీల అభిప్రాయం కోరిన ఈసీ... ఈ నెలాఖరులోపు పార్టీలు తమ వైఖరి తెలపాలని విజ్ఞప్తి చేసింది. ఆర్‌వీఎం సాంకేతికత, వలస కార్మికులను ఎలా నిర్వచిస్తారు? రిమోట్ ఓటింగ్ ఎలా జరుగుతుంది? ఓటర్లను ఎలా గుర్తిస్తారు? తదితర విషయాలపై ఓ నోట్‌ను పార్టీలకు అందిం చింది. రిమోట్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ విధానాన్ని తేవడం వల్ల ఓటింగ్ శాతం పెరుగుతుందని, ఈ విధానం అమల్లోకి వస్తే వలస కార్మికులు వారి సొంత జిల్లాలకు వెళ్లాల్సిన అవసరం లేదని ఈసీ వెల్లడించింది. ఈ సమావేశానికి టీడీపీ శాసనసభ్యులు పయ్యావుల కేశవ్, ఎన్నార్టీ మాజీ చైర్మన్ వేమూరి రవికుమార్ హాజరయ్యారు. ఆర్‌వీఎం అమల్లో కొన్ని అభ్యంతరాలను ఈసీ దృష్టికి తెచ్చారు. వీటిపై స్పష్టత లేనందున, దీని అమలుకు తొందరపడవద్దని, మరింత లోతుగా చర్చించాలని కోరారు.

మేం జోక్యం చేసుకోం...

జోషీమఠ్‌పై విచారణకు సుప్రీంకోర్టు తిరస్కృతి

న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్‌లోని జోషీమఠ్‌లో భూమి కుంగడాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. కేవలం సోషల్‌మీడియాలో ప్రచారం కోసం సుప్రీంకోర్టులో పిటిషన్లు వేయొద్దని సూచించింది. దీనిపై హైకోర్టుకు వెళ్లాలని ఆదేశించింది. జోషీమఠ్‌లో భూమి కుంగిపోతుండటంతో అక్కడి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్న నేపథ్యంలో దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించేలా కేంద్రానికి మార్గదర్శకాలు జారీచేయాలని కోరుతూ అవిముక్తేశ్వరానంద సరస్వతి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో పాటు అక్కడి బాధితులకు పరిహారం, ఆర్థిక సాయం అందించేలా ఆదేశాలు జారీచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది.'హైకోర్టు విస్తృత అంశాలపై దృష్టిపెడుతుంది. అందువల్ల ఈ పిటిషన్‌తో అక్కడకు వెళ్లేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛ కల్పిస్తున్నాం. జోషీమఠ్ అంశంపై పిటిషనర్ హైకోర్టు ముందు కొత్త పిటిషన్ వేసుకోవచ్చు లేదా పెండింగ్ పిటిషన్లలో వ్యాజ్యదారుడిగా చేర వచ్చు. ఈ అభ్యర్థనను విచారించేందుకు ఉన్నత న్యాయస్థానానికి అనుమతినిస్తున్నాం' అని ధర్మాసనం పేర్కొంది. జోషీమఠ్ తీవ్ర దృష్ట్యా దీనిపై విచారణ జరపాలని, బాధితులకు ఉపశమనం కల్పించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని పిటిషనర్ కోరారు. సుప్రీం ధర్మాసనం స్పందిస్తూ కేవలం సోషల్ మీడియాలో ప్రచారం కోసం సుప్రీంకోర్టు వాదనలను ఉపయోగించుకోవద్దు. మీకు కావాల్సింది బాధితులకు ఉపశమనమే కాదా దానికోసం హైకోర్టుకు వెళ్లండి' అని స్పష్టంచేసింది.

బాబు పర్యటన అడ్డుకోవడం దుర్మార్గం

అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రతిపక్షనేత చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడం అధికార దుర్వినియోగానికి నిదర్శనమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ...తమ పార్టీ కార్యకర్తలను అక్రమ కేసులతో సంక్రాంతి నాడు పుంగనూరు జైలులో పెట్టించి పెత్త తప్పు చేశారని మండిపడ్డారు. బాధితుల పరామర్శకు వెళ్తున ప్రతిపక్ష నేత చంద్రబాబుకు వ్యతిరేకంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బ్యానర్లు కట్టించడం, టీడీపీ బ్యానర్లు చించడం మరో తప్పు అని తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష నేత పర్యటనకు వ్యతిరేకంగా పోలీసులపై ఒత్తిడితెచ్చి సీఐతో 30-చట్టం కింద నోటీసు ఇప్పించడం అధికార దుర్వినియోగమేనని పేర్కొన్నారు. ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాలలో పోలీస్ యాక్టు 30 ఉన్నప్పటికీ...యథేచ్ఛగా కోడి పందేలు, జూదాలు జరుగుతున్నాయని వివరించారు. ఇక్కడ పోలీస్ చట్టం-30 ఏమైందని ప్రశ్నించారు. కేవలం ప్రతిపక్షాల్ని ప్రజల వద్దకు, బాధితుల వద్దకు వెళ్లకుండా నిరోధించడానికి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, పెద్దిరెడ్డి తప్పు చేయకపోతే ప్రతిపక్ష నేతను ఎందుకు అడ్డుకునే కుట్రలు చేస్తున్నారని నిలదీశారు. ప్రజల్ని భయపెట్టి భూ కబ్జాలు, ఇసుక, మైనింగ్ దోపిడీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇవన్నీ బయట పడతాయనే భయంతోనే ప్రజలపై, ప్రతిపక్షాలపై దాడులూ, ఇళ్లను ధ్వంసం చేయిస్తున్నారని, అక్రమ కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు. డీజీపీ జోక్యం చేసుకుని ప్రతిపక్ష నేత పర్యటన సజావుగా జరిగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు.

40 శాతం సంపద

(మొదటిపేజీ తరువాయి)

ప్రగతిశీల పన్ను చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని 'ఆక్స్‌ఫాం ఇండియా' తాజా నివేదిక తెలిపింది. 'సర్వైవల్ ఆఫ్ ది రిచెస్ట్: ది ఇండియా సప్లిమెంట్' పేరుతో వెలువరించిన ఈ నివేదికలో సంచలన విషయాలు వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా గత 25 ఏళ్లలో తొలిసారిగా సంపద, పేదరికం మధ్య అంతరం ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతుండటంపై స్విస్ స్కై రిసార్ట్‌లో జరిగిన దావోస్ సమావేశం కీలకంగా చర్చించింది. కోటీశ్వరులు మరింత కోటీశ్వరులుగా మారుతుంటే...ఆకలితో ఉన్న భారతీయులు 19 కోట్ల నుంచి 35 కోట్లకు పెరిగినట్లు నివేదిక తెలిపింది. దేశ సంపదలో 40 శాతం కేవలం ఒక్కశాతం బిలియనీర్ల చేతుల్లో ఉన్నట్లు ఆక్స్‌ఫామ్ తెలిపింది. అట్టడుగు స్థాయిలో ఉన్న సగం మంది జనాభా వద్ద మూడు శాతం సంపద మాత్రమే ఉన్నట్లు వెల్లడించింది. 2020లో భారత్‌లో 102 మంది బిలియనీర్లు ఉంటే 2022 నాటికి వీరి సంఖ్య 166కు పెరిగిందని, అంటే రెండేళ్లలో 64 మంది సంపన్నుల జాబితాలో చేరారని పేర్కొంది.

దేశంలోని 10 మంది సంపన్నులపై ఐదు శాతం చొప్పున పన్ను విధించడం ద్వారా వచ్చేదాంతో పిల్లలందరినీ బడిబాట పట్టించవచ్చునని ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ అభిప్రాయపడింది. 2017- 21 మధ్య కాలంలో గౌతమ్ అదానీ సంపద భారీగా పెరిగిందని, ఆయన సంపదపై ఒకసారి పన్ను విధిస్తే రూ.1.79 లక్షల కోట్లు వస్తాయని తెలిపింది. ఆ మొత్తంతో దేశంలోని ప్రాథమిక పాఠశాలల్లో 50లక్షల మంది ఉపాధ్యాయులను నియమించుకోవచ్చని నివేదిక పేర్కొంది. సంపన్నుల మొత్తం ఆస్తిపై విధించే రెండు శాతం పన్ను వల్ల పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న పిల్లలందరికీ మూడేళ్లకు సరిపడ పౌష్టికాహారాన్ని అందించేందుకు అవసరమైన రూ.40,423 కోట్లు పొందవచ్చని తెలిపింది. 10 మంది కుబేరులపై 5శాతం వన్‌టైమ్ ట్యాక్స్ (రూ.1.37 లక్షల కోట్లు) విధిస్తే 2022-23కిగానూ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ (రూ.86,200 కోట్లు), ఆయుష్ శాఖ (రూ.3,050 కోట్లు) అంచనా వేసిన నిధుల కంటే 1.5 రెట్లు (రూ. 1.37 లక్షల కోట్లు) ఎక్కువే వస్తాయని ఆక్స్‌ఫామ్ నివేదిక పేర్కొంది. ఈ నివేదిక లింగ అసమానత్వాన్ని ప్రస్తావించింది. పురుషులు సంపాదించే ప్రతి రూపాయికి 63 పైసలు మాత్రమే మహిళా పొందుతున్నట్లు వెల్లడించింది. షెడ్యూల్డ్ కులాలు, గ్రామీణ కార్మికుల ఆదాయాలలో వ్యత్యాసం ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది. అగ్రవర్ణాల సంపాదనతో పోల్చితే షెడ్యూల్డ్ కులాలు 55 శాతం మాత్రమే పొందుతున్నాయని పేర్కొంది. పట్టణాల్లో పనిచేసే వారితో పోల్చితే గ్రామీణ కార్మికులు సగం మాత్రమే సంపాదించినట్లు 2018-19 డేటా చెబుతోందని నివేదిక తెలిపింది.

టాప్ 100 బిలియనీర్లపై 2.5 శాతం పన్ను విధించడం లేదా 10 మంది భారతీయ బిలియనీర్లపై ఐదు శాతం పన్ను విధిస్తే చదువు మానేసిన పిల్లలందరినీ తిరిగి బడికి తీసుకురావడానికి సరిపడా నిధులు సమకూరతాయని నివేదిక తెలిపింది. భారత్‌లో అసమానత్వాల ప్రభావాన్ని అంచనా వేయడంలో ఈ నివేదిక నాణ్యత-పరిమాణాలతో సమ్మిళితమై ఉన్నట్లు ఆక్స్‌ఫామ్ పేర్కొంది. ఫోర్బ్స్, క్రెడిట్ సూజీ వంటి వర్గాలు సంపదలో అసమానత్వాన్ని, దేశంలోని కుబేరుల సంపద అంచనాకే అలవాటు పడ్డాయని, ఎన్ఎస్ఎస్, కేంద్ర బడ్జెట్ పత్రాలు, పార్లమెంటరీ ప్రశ్నలు తదితరాలు తమ నివేదికను బలపర్చాయని తెలిపింది.

కోవిడ్ విజృంభించినప్పటి నుంచి 2022 నవంబరు వరకు కుబేరుల సంపద 121 శాతం లేదా రోజుకు రూ.3,608 కోట్లకు పెరిగినట్లు ఆక్స్‌ఫామ్ నివేదిక పేర్కొంది. 2021-22లో జీఎస్టీ ద్వారా వచ్చిన మొత్తం రూ.14.83లక్షల కోట్లలో సుమారు 64 శాతం దిగువనున్న 50 శాతం జనాభా నుంచి రాగా మూడు శాతం జీఎస్టీ మాత్రమే టాప్ 10 బిలియనీర్ల నుంచి వచ్చినట్లు పేర్కొంది. 100 మంది సంపన్నుల సంపద కలిపితే రూ.54.12లక్షల కోట్లు (600 బిలియన్ డాలర్లు) అని తెలిపింది. ఈ మొత్తం 18 నెలలకంటే ఎక్కువగా కేంద్ర బడ్జెట్‌కు నిధులు సమకూర్చేందుకు సరిపోతుందని పేర్కొంది.

దేశంలోని సంపన్నుల మనుగడకు మాత్రమే హామీనిచ్చే వ్యవస్థ వల్ల అణగారిన వర్గాలు, దళితులు, ఆదివాసీలు, ముస్లింలు, మహిళలు, అసంఘటిత రంగ కార్మికుల వెతలు వర్ణణాతీతమైనట్లు ఆక్స్‌ఫామ్ నొక్కిచెప్పింది. ధనికులతో పోల్చితే పేదలే అధిక పన్నులు చెల్లిస్తున్నారని, నిత్యావసరాలపై ఎక్కువగా ఖర్చు చేస్తున్నారని తెలిపింది. సంపన్నులపై పన్ను విధించేందుకు ఇదే సమయమని నొక్కిచెప్పింది. వారు తమ వాటాను కచ్చితంగా చెల్లించేలా చూడాలని ఆక్స్‌ఫామ్ ఇండియా సీఈవో అమితాబ్ బెహార్ కేంద్ర ఆర్థికశాఖకు సూచించారు. దేశంలో అసమానత్వాన్ని రూపుమాపేందుకు ప్రయోజనకారిగా రుజువైన ప్రగతిశీల పన్ను విధానాలు (సంపద పన్ను, వారసత్వ సంపదపై పన్ను విధించడం) అమలు చేయాలన్నారు. ఆస్తులు, భూములపై పన్నులు విధిస్తే సబబుగా ఉంటుందని తెలిపారు.

2024 నాటికి జీడీపీలో 2.5శాతం ఆరోగ్య రంగం కోసం బడ్జెట్‌లో కేటాయించాలని, జాతీయ ఆరోగ్య విధానం కింద ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలను పటిష్టపర్చుకోవాలని, విద్యకు సముచిత బడ్జెట్ కేటాయించాలని, సంఘటిత-అసంఘటిత రంగాల కార్మికులకు కనీస వేతనాలు అందించాలని, పెరుగుతున్న జీవన వ్యయం దృష్ట్యా గౌరవమైన జీవితానికి హామీనిచ్చేలా కనీస వేతనాలు ఉండేలా చూడాలని ఆక్స్‌ఫామ్ సూచించింది.

22 నెలల కనిష్ఠానికి డబ్ల్యూపీఐ

న్యూఢిల్లీ: టోకు ధరలాధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) 22 నెలల కనిష్ఠానికి చేరింది. 2022 డిసెంబరులో 4.95శాతంగా నమో దైంది. కూరగాయలు, నూనె గింజలు తదితర ఆహార వస్తువుల ధరలు తగ్గడమే ఇందుకు కారణం. 2022 నవంబరులో డబ్ల్యూపీఐ ఆధారిత ద్రవ్యోల్బణం 5.85శాతంగా ఉంటే 2021 డిసెంబరులో 14.27శాతంగా ఉంది. గతనెలలో కూరగాయలు, నూనె గింజల ధరలు దిగిరావడంతో ద్రవ్యోల్బణం మైనస్ 1.25 శాతానికి తగ్గింది. గోధుమలు, పప్పులు, బంగాళదుంపలు మాత్రం అధిక ధర పలికాయి. గుడ్లు, మాంసం, చేపల ధరలూ ఎక్కువగా కొనసాగాయి. 2022 డిసెంబరులో ద్రవ్యోల్బణం రేటు తగ్గడానికి ఆహార వస్తువులతో పాటు నూనెలు, ముడిచమురు, సహజ గ్యాస్, టెక్స్‌టైల్, రసాయనాలు వంటివి ధర తగ్గడమే కారణమని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ ప్రకటన తెలిపింది. అంతకుముందు 2021 ఫిబ్రవరిలో 4.83 శాతంగా డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం నమోదైంది. సోమవారం విడుదల చేసిన డేటా ప్రకారం చమురు, విద్యుత్ ద్రవ్యోల్బణం నవంబరులో 17.35 శాతం నుంచి డిసెంబరులో 18.09 శాతానికి స్వల్పంగా పెరిగింది. ఉత్పత్తి వస్తువులకు సంబంధించి గతనెలలో 3.37శాతంగా నమోదైంది. అలాగే. ముడి చమురు, సహజ గ్యాస్ డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం డిసెంబరులో 39.71శాతానికి తగ్గింది.

కొలీజియంలో ప్రభుత్వానికి ప్రాతినిధ్యం

(మొదటిపేజీ తరువాయి)

ఎంపికలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందని సీజేఐకు రాసిన లేఖలో రిజిజు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం చేసిన సూచనలు, గమనించిన విషయాల ఆధారంగానే లేఖలో కొన్ని అంశాలను ప్రస్తావించినట్లు తెలిపారు. న్యాయవ్యవస్థ పేరిట సౌకర్యమైన రాజకీయాలు తగవన్నారు. రాజ్యాంగానికి ఏదీ అతీతం కాదని రిజిజు ట్వీట్ చేశారు. అదే సమయంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలను ట్విట్టర్ మాధ్యమంగా ఆయన తిప్పికొట్టారు. తమ నామినీలను కొలీజియంలో చేర్చాలని సుప్రీంకోర్టును కేంద్రప్రభుత్వం కోరడం చాలా ప్రమాదకరమని కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలకు స్పందనగా 'మీరు కోర్టు నిర్ణయాన్ని గౌరవిస్తారని భావిస్తున్నా! నాడు ఎన్‌జేఏసీ చట్టాన్ని కొట్టివేసినప్పుడు సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం చేసిన సూచనల ప్రకారమే ఈ కార్యాచరణ కోరుతున్నాం. కొలీజియం వ్యవస్థ ఎంఓపీలను తిరిగి రూపొందించాలని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సూచించింది' అని రిజిజు ట్వీట్‌చేశారు. 'న్యాయవ్యవస్థలో జరిగే నియామకాల్లో ప్రభుత్వ జోక్యం ఏ మాత్రం ఉండరాదు. ఇది చాలా ప్రమాదకరం' అని కేజ్రీవాల్ అంతకుముందు ట్వీట్ చేశారు. రిజిజుతో పాటు ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కూడా న్యాయవ్యవస్థను విమర్శించారు. శాసనాధికారులను అతిక్రమించే యత్నం జరుగుతోందని ధన్కర్, బిర్లా వ్యాఖ్యానించారు. జడ్జీల నియామకం, పదోన్నతులు, బదిలీల విషయమై ఏడేళ్లుగా కేంద్రానికి, కొలీజియానికి మధ్య రాజీ కుదరకపోవడం ఆశ్చర్యకరమని పార్లమెంటరీ ప్యానెల్ కూడా ఇటీవల వ్యాఖ్యానించడం విదితమే.

అధికార కోడి బరితెగింపు

పోలీసుల ప్రేక్షక పాత్ర

ప్రతిపక్షాల బరులకు కప్పం వసూలు

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: అధికార కోడి బరితెగించింది. సంక్రాంతి వేళ సంప్రదాయం ముసుగులో కోడికి కత్తి కట్టారు. నోట్ల కట్టలు దిగాయి. ఎప్పటిలాగే కోడే గెలిచింది. సంక్రాంతి పండగ 3 రోజులు పందెం కోళ్లు కాలు దువ్వుతూ ఖద్దరుకు సవాల్ విసిరాయి. రాజకీయ ఒత్తిళ్లకు పోలీసులు మిన్నకుండారు. దీంతో గ్రామస్థాయిలో సైతం కోడిపందాలు విచ్చలవిడిగా నిర్వహించారు. అధికార పార్టీ నాయకులు పోలీసుస్టేషన్‌లో సంప్రదింపులు జరిపిన తర్వాత 3 రోజులు యథేచ్ఛగా బరితెగించారు. కోడి పందాల నిర్వహణకు పోలీసుల పరోక్ష అనుమతి ఉందని నిర్భయంగా వాట్సాప్ సందేశాల ద్వారా సమాచారం అందించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అధికార దుర్వినియోగం విచ్చలవిడిగా జరిగింది. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, అనుచరులు, పార్టీ నేతలు పల్లె ప్రాంతాలలో నిర్భయంగా బరులు ఏర్పాటు చేసి కోడిపందాలు నిర్వహించారు. చిన్నా పెద్దా తేడా లేకుండా పల్లెల్లో సైతం బరులు ఏర్పాటు చేశారు. గతంలో కన్నా నాలుగు రెట్లు బరులు అధికంగా వెలిశాయి. ప్రతిపక్ష పార్టీల బరుల నిర్వాహకులను అధికార పార్టీ నేతలు బెదిరించి కప్పం వసూలు చేశారు. బరుల సమీపంలో గుండాట, కోతాటను స్వయంగా అధికార పార్టీ నాయకులే దగ్గరుండి నడిపించారు.

మూడు రోజులకు గుండాట నిర్వహించుకోవడానికి రూ.2 లక్షలు, బెల్ట్ షాపుకు రూ.50 వేలు, బిర్యానీ షాపుకు రూ.30 వేలు వసూలు చేశారు. తొలుత సంక్రాంతి సంబరాలు, ముగ్గుల పోటీల పేరుతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి...ఏమాత్రం అనుమానం రాకుండా కార్యక్రమం నిర్వహించారు. భోగిరోజు నుండి సీన్ మారిపోయింది. ఈసారి పందాల నిర్వహణలో బౌన్సర్లు, ఇనుప కంచెతో హడావుడి కనిపించింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం సీసలిలో నగదు రహిత లావాదేవీలు జరిగాయి.

అధికార పార్టీ అభయం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కోడి పందాలకు అనుమతి ఉందని స్వయంగా అధికార పార్టీ నాయకులు ప్రచారం చేశారు. భీమవరం, ఆకివీడు మండలాలలో శుక్రవారం సంప్రదాయక క్రీడలు నిర్వహించి అదే ప్రాంగణంలో కోడిపందాలు కొనసాగించారు. ఉంగుటూరు మండలంలో శాసనసభ్యులు పుప్పాల వాసుబాబు, దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. సీసలిలో ఉండి శాసనసభ్యులు మంతెన రామరాజు స్వయంగా కోడిపందాలు నిర్వహించారు. ఏలూరు జిల్లా దెందులూరు, కైకలూరు, ఉంగుటూరు, పోలవరం నియోజకవర్గాలలోని అన్ని మండలాల్లో ఏర్పాటు చేసిన బరులకు, పెదవేగి మండలం కొండలరావుపాలెంలో జరిగిన కోడిపందాలకు తెలంగాణ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, రామచంద్రరావు పాల్గొన్నారు. ఉండి నియోజకవర్గం కాళ్ల మండలంలో గుంటూరు జిల్లా మాచర్ల శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఉండి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు పందాలను స్వయంగా వీక్షించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మూడు రోజులు జరిగిన కోడిపందాలు, జూదాలలో రూ.500 కోట్లు చేతులు మారినట్లు తెలుస్తోంది.

ఏరులై పారిన మద్యం

కోడి పందాల బరులకు ప్రభుత్వం నిర్వహిస్తున్న వైన్‌షాపుల నుంచే కాకుండా తెలంగాణ మద్యాన్ని కూడా విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అన్ని చోట్ల మద్యం ఏరులై పారింది. సంక్రాంతి పండగ మూడు రోజులలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రూ.27.81 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్: ఈశ్వరయ్య

విశాలాంధ్ర-ఒంగోలు: యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య అన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్ కరవది గ్రామ 72వ వార్షికోత్సవ సభ కరవదిలో లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ దేశ భవిష్యత్ యువత మీదే ఆధారపడి ఉందని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు కరుణానిధి, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి, సీతారామయ్య తదితరులు ప్రసంగించారు. రవి, సురేశ్, శ్రీనివాస్, ప్రవీణ్, అశోక్, మూర్తి, హనుమంతరావు పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నృత్య పోటీలు ప్రజలను ఆకర్షించాయి.

ఘనంగా ఎఫ్‌సీఐ వ్యవస్థాపక దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) 59వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను అమరావతి ప్రాంతీయ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎఫ్‌సీఐ-ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ జోషి మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) కింద ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రూ.30.08లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం, అండమాన్, నికోబార్ దీవుల ప్రజలకు 8వేల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేసినట్లు తెలిపారు. ఎన్ఎఫ్ఎస్ఏ చట్టం కింద లబ్ధిదారులందరికీ ఉచిత బియ్యం, భారత ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఆహార ధాన్యాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. తొలుత కేంద్ర వాణిజ్య, పరిశ్రమలు, సీఎఫ్ అండ్ పీడీ, జౌళిశాఖ మంత్రి పీయూష్ గోయెల్, గ్రామీణ పర్యావరణ శాఖ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి వర్చువల్‌గా ఎఫ్‌సీఐ ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ వేడుకల్లో భాగంగా రంగోలీ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. ఎఫ్‌సీఐ డీజీఎం అశిష్ తక్, ఏజీఎం రాఘవేంద్రసింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రగాళ్ల నెపంతో దంపతుల హత్య

విశాలాంధ్ర-చింతూరు (అల్లూరి జిల్లా): మంత్రగాళ్లనే నెపంతో, ఇతర కారణాల వల్ల మిడియం లక్ష్మయ్య (56) మిడియం సింగమ్మ (54) అనే దంపతులను గుర్తు తెలియని వ్యక్తులు గొడ్డలితో నరికి అతి కిరాతకంగా హత్య చేశారు. ఈ ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని స్టాపర్ట్‌పేటలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనపై చింతూరు ఎస్ఐ యాదగిరి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ పదేళ్లు పొడిగించాలి

విశాలాంధ్రబ్యూరో-విశాఖ పట్నం: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ మరో 10ఏళ్లు పొడిగించాలని విజ్ఞప్తి చేస్తూ దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఎస్సీ సంక్షేమంపై శాసనసభా కమిటీ చైర్మన్ గొల్ల బాబురావుకి వినతి పత్రం అందజేసినట్లు డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జే.వి. ప్రభాకర్ ప్రకటనలో తెలిపారు. దళిత, గిరిజనుల అభివృద్ధి కోసం 2013లో సబ్ ప్లాన్ చట్టం రూపొం దించారని, దాని కాల పరిమితి జనవరి 2023తో ముగుస్తుందన్నారు. పాలకుల నిర్లక్ష్యం వల్ల చట్టం ఉద్దేశం ఇంకా పూర్తిస్థాయిలో నెరవేరలేదని, ప్రస్తుత పరిస్థితుల్లో భావి తరాలకి సబ్ ప్లాన్ పొడిగింపు అత్యవసరం అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ మరో పదేళ్ల పాటు వెంటనే పొడిగించేలా ప్రభుత్వాన్ని కోరుతూ విజ్ఞప్తి చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ మరో పది సంవత్సరాలు పొడిగించాలని, ప్రస్తుతం వున్న పేరుని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి చట్టంగా మార్చాలన్నారు. ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఖర్చు కాకుండా మిగిలిపోయిన నిధులను మరుసటి సంవత్సరంలో కేటాయించిన బడ్జెట్ కి అదనంగా కలిపి ఖర్చు చేయాలని, 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటి వరకు సబ్ ప్లాన్ నిధుల వినియోగంపై సామాజిక తనిఖీ నిర్వహించాలని, జరిగిన అభివృద్ధిపై అధ్యయనం చేసి శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సబ్ ప్లాన్ బడ్జెట్ పర్యవేక్షణకు జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీలు బాధ్యతాయుతంగా పనిచేయా లని, ఈ కమిటీకి జిల్లాలో ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు ఎవరో ఒకరిని చైర్‌పర్సన్‌గా నియమించి స్థానిక దళిత గిరిజన పౌరసంఘాలను, ఎన్జీవోలు భాగ స్వామ్యం చేయాలన్నారు. సబ్ ప్లాన్ ద్వారా అమలు చేస్తున్న యువత పథ కాలు, కార్యక్రమాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ వినతి పత్రం అందజేసిన వారిలో ఏఎంఎస్ అధ్యక్షులు బొడ్డు కల్యాణ్‌రావు, సుబ్బలక్ష్మి, డీహెచ్‌పీఎస్ నాయకులు ఎస్‌రాజు, బోడపాటి అప్పారావు, సత్తిబాబు, కన్నారావు, జీఎన్ రావు, కృష్ణంరాజు, శ్రీరాము పాల్గొన్నారు.

కేఆర్ఎంబీ కోసం రేపు నంద్యాలలో ధర్మదీక్ష

విశాలాంధ్ర-నంద్యాల: కృష్ణానది పరీవాహక ప్రాంతంలో అత్యంత కీలకమైన శ్రీశైలం ప్రాజెక్టు గల ప్రాంతంలో కృష్ణానది యాజమాన్య బోర్డును ఏర్పాటు చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నంద్యాల జిల్లా రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో దశరథరామిరెడ్డి సోమవారం మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యంతో రాయలసీమ ప్రాంతానికి నీటి వాటాలో అన్యాయం జరుగుతోందని, దీన్ని నివారించాలన్నా, రాయలసీమ ప్రాజెక్టులకు సక్రమంగా నీరు అందించాలన్నా కర్నూలులో కృష్ణాబోర్డు ఏర్పాటు చేయాలని ఆయన స్పష్టం చేశారు. పట్టిసీమ నిర్మా ణంతో కృష్ణా డెల్టాకు శ్రీశైలం ప్రాజెక్టుతో బంధం తెగిపోయిందన్నారు. కేవలం 264 టీఎంసీ నీటిని మాత్రమే సాగర్‌కు వదలాలని, మిగిలిన నీటిని రాయలసీమ ప్రాంతంలో నికర జలాలు ఉన్న ప్రాజెక్టులకు కేటాయించాలని, రాయలసీమ సాగునీటి సాధన సమితి చేపట్టిన అనేక ఉద్యమాల ఫలితంగా అనుమతులు సాధించుకున్న గాలేరు-నగరి, హంద్రీ-నీవా, తెలుగుగంగ, వెలిగొండ ప్రాజెక్టులతో పాటు నెల్లూరు, మహబూబ్ నగర్ జిల్లాలకు, మద్రాసుకు తాగునీటి సరఫరా సక్రమంగా జరగడానికి నీటిని నియంత్రించే శ్రీశైలం రిజర్వాయర్ గల కర్నూలులో కృష్ణాబోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కృష్ణాబోర్డును విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదించడంపై రాయలసీమ రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. కర్నూలులో బోర్డు ఏర్పాటు అంశాన్ని రాయలసీమ ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లామని, ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చినట్లు దశరథ రామిరెడ్డి తెలిపారు. కర్నూలులో బోర్డు ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తూ ముఖ్యమంత్రికి, ప్రజాప్రతినిధులందరికీ లేఖలు రామన్నారు. కర్నూలులో బోర్డు ఏర్పాటు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు రాయలసీమ సాగు నీటి సాధన సమితి ఈనెల 18న నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర పెద్ద ఎత్తున ధర్మదీక్ష నిర్వహిస్తున్నామన్నారు. దీనికి ప్రజాప్రతి నిధులను ఆహ్వానిస్తూ ఉత్తరాలు పంపామన్నారు.

నాగబాబుకు అంబటి కౌంటర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జనసేన నాయకుడు నాగబాబు ట్వీట్‌కు రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు వ్యంగ్యంగా బదులు ట్వీట్ చేశారు. సంక్రాంతి వేడుకల్లో భాగంగా స్థానికులను ఉత్సాహపరిచేందుకు లంబాడీ సోదరీమణులతో కలిసి మంత్రి డ్యాన్స్ చేసిన వీడియోను ట్విట్టరులో షేర్ చేశారు. దీనిపై నాగబాబు వ్యంగ్యంగా స్పందించారు. అంబటి డ్యాన్స్ బాగుందనీ, పోలవరం పనులు పూర్తిచేసి వస్తే బాగుండేదన్నారు. దానిపై 'నువ్వు, మీ తమ్ముడు పవన్ కల్యాణ్ అన్నట్లుగా నేను సంబరాల రాంబాబునేగానీ ముఖానికి రంగువేయను, ప్యాకేజీ కోసం డ్యాన్స్ చేయను' అని అంబటి కౌంటర్ ట్వీట్ చేశారు.

వైసీపీ పనైపోయింది

ఇది ప్రభుత్వ ప్రేరేపిత ఉగ్రవాదం

పీలేరులో చంద్రబాబు

సబ్ జైలులో టీడీపీ కార్యకర్తలకు పరామర్శ

విశాలాంధ్ర-పీలేరు: ఏం తప్పులు చేశారని తమ పార్టీ నేతలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రశ్నించారు. అన్నమయ్య జిల్లా పీలేరు సబ్‌జైలులో ఉన్న పార్టీ కార్యకర్తలను సోమవారం మధ్యాహ్నం ఆయన పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని, కేసులకు భయపడాల్సిన పనిలేదని భరోసా ఇచ్చారు. తెగించి పోరాడితే టీడీపీదే విజయం అని స్పష్టం చేశారు. కాగా, చంద్రబాబు రాక నేపథ్యంలో పీలేరు సబ్ జైలు వద్ద భారీ కోలాహలం నెలకొంది. పరిసర గ్రామాల నుంచి కూడా భారీగా టీడీపీ శ్రేణులు తరలివచ్చాయి. చంద్రబాబును చూసి నినాదాలు చేస్తూ ఉత్సాహాన్ని వెలిబుచ్చారు. చంద్రబాబు కాన్వాయ్ పై పూల వర్షం కురిపించారు. అంతకుముందు పీలేరులో చంద్రబాబు పర్యటనపై పోలీసులు ఆంక్షలు విధించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. టీడీపీకి సంబంధించిన సౌండ్ బాక్స్ వాహనాన్ని సీజ్ చేశారు. దానికి అనుమతి లేదని అడ్డుకున్నారు. కార్యకర్తల పరామర్శ అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా కొడతారా? అంటూ మండిపడ్డారు. తప్పు ఒప్పుకోవాలని ఒత్తిడి చేస్తారా? అని నిలదీశారు. తమ పార్టీ కార్యకర్తలపై సీఐ, ఎస్సై చాలా దారుణంగా వ్యవహరించారని ఆగ్రహించారు. ఎంతమందిని జైల్లో పెడతారో తాము చూస్తామన్నారు. భయపెట్టి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారని ఆరోపించారు. అక్రమ కేసులు పెడితే ఊరుకునేది లేదని, దీనికి మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. పుంగనూరు నియోజకవర్గం లో ఏడుగురు మైనారిటీ సోదరులపై అక్రమంగా కేసులు పెట్టారని, అయ్యప్ప భక్తుడిపైనా కేసు పెట్టి జైల్లో పెట్టారన్నారు. అరెస్టు చేసిందే కాక స్టేషన్‌కు తీసుకొచ్చి వారిని హింసించారని, ఇక్కడి సీఐ, ఎస్ఐ అరెస్ట్ చేసిన వారిని తీవ్రంగా కొట్టి, భయపెట్టి మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టారని చెప్పారు. మేజిస్ట్రేట్ వద్ద కొట్టినట్లు చెప్తే కాల్చేస్తాం... కేసులు పెట్టి తిప్పుతాం అని బెదిరించారని దీనికంటే ఉగ్రవాద చర్య మరొకటి ఉంటుందా? అని ప్రశ్నించారు.

పోలీసులకు ఎవరిచ్చారు ఈ హక్కు?

రాష్ట్రంలో ప్రభుత్వ ప్రేరేపిత ఉగ్రవాదం నడుస్తోందని చంద్రబాబు మండిపడ్డారు. పోలీసులు చట్ట ప్రకారం పనిచేయాలన్నారు. చల్లా బాబు రెడ్డి జన్మదినం సందర్భంగా టీడీపీ కార్యకర్తలు ఫ్లెక్సీలు కడితే, వైసీపీ దొంగలు వచ్చి ఫ్లెక్సీలను చించివేశారని, అప్పుడు పోలీసులు గాడిదలు కాస్తున్నారా? మేము వైసీపీ ఫ్లెక్సీలు చించితే పోలీసులు మమ్మల్ని వదిలిపెడతారా? అన్నారు. వైసీపీ వారే ఫ్లెక్సీలు చించి వాళ్లే ఎదురు కేసులు పెట్టారని, పోలీసులు ఎందుకు ఏకపక్షంగా వ్యవహరించారని అడిగిన పాపానికి మా కార్యకర్తలపై లాఠీఛార్జ్ చేసి చితక్కొట్టారన్నారు. 'ఉయ్యాల జ్యోతి, ఉయ్యాల కిషోర్, నాగార్జున నాయుడు, అక్రమ్ తీవ్రంగా గాయపడ్డారు...రొంపిచర్ల ఎస్ఐ సహకారంతో 145, 147, 307, 324 వంటి రకరకాల ఐపీసీ సెక్షన్ల కింద 11 మందిపై కేసులు పెట్టారు. రాష్ట్రంలో ఎవరూ పర్యటించకూడదా? గతంలో రాజశేఖర్ రెడ్డి, విజయమ్మ, షర్మిల కూడా తిరిగారు. జగన్ రెడ్డి కూడా పాదయాత్రలు చేశాడు కానీ నేను ఎప్పుడూ ఎక్కడా అడ్డంకులు సృష్టించలేదు. తప్పుడు కేసులు పెడుతున్నారు. మైనారిటీ సోదరులకు పిలుపునిస్తున్నా. ఇప్పటికే 50 మందికి పైగా ముస్లిం సోదరులపై దాడులు చేశారు. నంద్యాలలో అబ్దుల్ సలాం కుటుంబం పోలీసుల వేధింపులు తాళలేక రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకుంది. ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తున్నారు. ప్రతిఘటిస్తే చంపేస్తున్నారు. పండగపూట చెప్తున్నా... నా కార్యకర్తలను పండగపూట జైల్లో పెట్టావు పెద్దిరెడ్డి. నేను కూడా పండగ జరుపుకోకుండా జైలు వద్దకు వచ్చా. ప్రజలు కూడా పండగ నాడు జైలు వద్దకు వచ్చారు. పెద్దిరెడ్డీ నీ పని, వైసీపీ పని అయిపోయింది. అందుకే సైకో పోవాలి...సైకిల్ రావాలి అనేది ఇంటింటి నినాదం అయింది. తప్పుడు కేసులు పెట్టి, రాక్షసానందం పొందడం సైకోలు తప్ప మరెవరైనా చేస్తారా? వేరే రాష్ట్రాల నుండి మద్యం తెచ్చి దొంగ వ్యాపారం చేసే వాళ్లను జైల్లో పెట్టాలి.మమ్మల్ని బాధపెట్టిన వాళ్లను వదిలిపెట్టం.

నూటికి95శాతంమందిపోలీసులు మంచివాళ్లు ఉన్నారు. కానీ కొందరు పోలీసులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. రొంపిచర్ల ఎస్సై, కల్లూరు సీఐ ఎలా తప్పించుకుంటారో చూస్తా... మీ ఇష్ట ప్రకారం కొట్టి తిడతారా? అమ్మ, అక్క అని తిడతారా? నేను కూడా బూతులు మాట్లాడితే ప్రజలు మీ మొహాన ఉమ్మేతారు, పోలీసుల ఆటలు సాగుతున్నాయని తప్పుడు కేసులు పెట్టి హింసిస్తున్నారు. రాష్ట్రంలో మైనార్టీలకు మనుగడ లేదు' అంటూ ఆవేశపూరితంగా మాట్లాడారు.

నన్ను పీలేరు రాకుండ అడ్డుకుంటారా?

'నేను ఎక్కడికి వస్తే అక్కడ పోలీసు యాక్టు 30 పెడతారా? చట్టాన్ని అతిక్రమించి వ్యవహరించి మమ్మల్ని ఇబ్బంది పెట్టిన ఎవరినీ వదిలిపెట్టం' అని చంద్రబాబు అన్నారు. ' నేను ఎక్కడికి వస్తే అక్కడ పోలీసు యాక్టు 30 పెడతారా? చట్టాన్ని అతిక్రమించి వ్యవహరించి మమ్మల్ని ఇబ్బంది పెట్టిన ఎవరినీ వదిలిపెట్టం' అని చంద్రబాబు అన్నారు.

సబ్‌జైలు వద్ద ఆందోళన

అన్యాయంగా తమ వారిపై కేసులు పెట్టారని పీలేరులో మహిళలు ఆందోళనకు దిగారు. ఫ్లెక్సీల గొడవలో తమ వారికి సంబంధం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. హత్యాయత్నం కేసులు పెట్టి తమవారిని వేధిస్తున్నారని ఆరోపించారు. మరోవైపు పీలేరు సబ్ జైలు వద్ద చంద్రబాబుతో మాట్లాడుతుండగా పర్వీన్ అనే మహిళ సొమ్మ సిల్లి పడిపోయింది. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే ఆమెను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

సామాజిక బాధ్యతలో ఆదర్శనీయుడు పరసా రాజరత్నం

జల్లి విల్సన్ నివాళి

విశాలాంధ్ర-విజయవాడ: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతితోపాటు సామాజిక బాధ్యతను నిర్వర్తించడంలో పరసా రాజరత్నం ఆదర్శనీయుడని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. కమర్షియల్ ట్యాక్స్ క్లాస్-4 ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు పరసా రాజరత్నం ప్రథమ వర్ధంతి సభ విజయవాడ మొగల్రాజపురం బందులదొడ్డి సెంటర్‌లో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో జల్లి విల్సన్ మాట్లాడుతూ కుటుంబ బాధ్యత నిర్వహించటంలో, ప్రభుత్వ ఉద్యోగిగా, 4వ తరగతి ఎన్‌జీవో ఉద్యమ నాయకులుగా రాణించటమే కాకుండా సామాజిక అభివృద్ధిలో పాలుపంచుకోవటంలో రాజరత్నం ముందుంటారని శ్లాఘించారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగవటంతో సమాజంలో విపరీత పోకడలు పొడచూపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కుటుంబంలోని ప్రతిఒక్కరినీ ఉన్నతంగా తీర్చిదిద్దటంతో రాజరత్నం చాలా బాధ్యతగా వ్యవహరించారని గుర్తు చేశారు. కమ్యూనిస్టులు, క్రైస్తవుల సంఘాలు మాత్రమే పేదలకు అండగా ఉంటారని, వారికి విద్య,వైద్య సౌకర్యాలు కల్పిస్తారన్నారు. తాను కార్పొరేటర్‌గా పోటీ చేసినప్పుడు రాజరత్నం రాజకీయాలకతీతంగా అండగా నిలిచి తన విజయానికి చేసిన మేలును మర్చిపోలేనన్నారు. మొగల్రాజపురంలోని సీఎస్ఐ పాఠశాలకు దాతల సహకారంతో రెండు శాశ్వత భవనాలు నిర్మించటానికి, మాల, మాదిగలకు చెందిన రెండు శ్మశానాలకు మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా ప్రహరీ నిర్మాణం, సీఎస్ఐ చర్చికి తాగునీరు, డ్రైనేజీ వసతుల కల్పనతో పాటు శాశ్వతంగా పన్ను మినహాయింపు కల్పించటంలో ఎంతో సహకరించారన్నారు. బోయపాటి మాధవరావు పేరుతో స్థానిక కమ్యూనిస్టు పార్టీకి లైబ్రరీ నిర్మాణం, 510 మంది వృద్ధులు, వితంతువులకు పింఛన్‌లు ఇప్పించటంలోనూ సహకరించారని విల్సన్ చెప్పారు. ప్రతిఒక్కరితో ఆత్మీయంగా ఉంటూ సూచనలు, సలహాలు ఇస్తూ కీర్తిగడించారన్నారు. మన శాయశక్తులు, పరపతిని సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడేలా పనిచేయటమే రాజరత్నంకు మనమిచ్చే నిజమైన నివాళి అని ఆయనన్నారు. కార్యక్రమంలో మతపెద్దలు, స్థానికులు హాజరయ్యారు.

తెలంగాణ హైకోర్టుకు గంగిరెడ్డి బెయిల్ బదిలీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బాబాయి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రధాన నిందితునిగా ఉన్న ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు పిటీషన్‌పై విచారణను తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. వివేకా హత్య కేసు విచారణను ఇప్పటికే తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేసినందున, ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు పిటీషన్‌పై ఆ కోర్టు నిర్ణయం తీసుకుంటుందని జస్టిస్ ఎంఆర్ షా నేతృత్వంలోని ధర్మాసనం వెల్లడించింది. గతంలో బెయిల్ మంజూరు చేసినప్పుడు మెరిట్‌ను పరిగణనలోకి తీసుకోలేదు. ఇప్పుడు తెలంగాణ హైకోర్టు అన్ని అంశాలను పరిశీలించి బెయిల్ రద్దుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వివేకా హత్య కేసు దర్యాప్తులో భాగంగా ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలని సుప్రీంకోర్టులో సీబీఐ పిటీషన్ దాఖలు చేసింది. ఈ కేసులో ఏపీ పోలీసులు సకాలంలో ఛార్జిషీటు దాఖలు చేయకపోవడంతో గంగిరెడ్డికి బెయిల్ వచ్చింది. ఆ తర్వాత ఈ కేసును సీబీఐకి అప్పగించడంతో అనేక కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో గంగిరెడ్డి బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ సీబీఐ పిటీషన్ దాఖలు చేసింది.దీనిపై గంగిరెడ్డి తరపు న్యాయవాది బెయిల్ రద్దు చేయాల్సిన అవసరం లేదని, సీబీఐ విచారణకు గంగిరెడ్డి పూర్తిగా సహకరిస్తున్నారని తెలిపారు. వివేకా హత్య కేసులో గంగిరెడ్డి కీలక నిందితుడని, ఆయనని విచారించడం ద్వారానే ఈ కేసు కొలిక్కి వస్తుందని, అందువల్ల ఆయన బెయిల్ రద్దు చేయాలని సీబీఐ తరపు న్యాయవాది వాదించారు. ఉభయ పక్షాల వాదనలు విన్న ధర్మాసనం బెయిల్ రద్దు పిటీషన్ విచారణను తెలంగాణ కోర్టుకి బదిలీ చేస్తూ తీర్పు ఇచ్చింది.

శిల్పకళా సౌందర్యానికి నిలయం సోమేశ్వరాలయం

విశాలాంధ్ర-నల్లగొండ: పానగల్లులోని పచ్చల సోమేశ్వరాలయం, అద్భుత శిల్ప, వాస్తుకళకు అద్దం పడుతోందని, తెలంగాణలోనే ఇది అరుదైన చతుష్కూటాలయమని దక్కన్ హెరిటేజ్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకులు, వారసత్వ నిపుణులు, హెలెన్ ఫిలాన్ అన్నారు. నల్లగొండ సమీపంలోని ఈ ఆలయాన్ని ఆమె, అమెరికన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ దక్కన్ హెరిటేజ్ ఫౌండేషన్ సభ్యులతో కలిసి సోమవారం సందర్శించారు. ప్రముఖ పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డా॥ ఈమని శివనాగిరెడ్డి, పానగల్లుమంచి పాలించిన కందూరు చోళవంశానికి చెందిన రెండో ఉదయన చోలుడు (క్రీ.శ.1136-76), నాలుగు దేవాలయాల సముదాయమైన ఈ ఆలయాన్ని చతుష్కూటాలయంగా విశాలమైన మహా మండపంతో, రాష్ట్రకూట, కళ్యాణ చాళుక్య వాస్తుశైలిలో నిర్మించి పానగల్లులో తనపేర ఉదయ సముద్రమనే ఒక పెద్ద చెరువును తవ్వించాడని వివరించారు. ఆలయ అధిష్ఠానం, గోడలు, వోష్టాలు, స్థంబాలు, కప్పు, ద్వారశాఖలపై భారత భాగవత, రామాయణ, సమకాలీన జీవన విధానాన్ని తెలిపే శిల్పాలు, ఇంకా జంతువులు సృజనాత్మక డిజైన్లతో అలంకరించారని తెలిపారు. ఆలయం గోడలన్నీ అష్టదిక్పాలకులు, త్రిమూర్తులు, మహిషాసురమర్ధిని, రతీమన్మథ, గణేశ, సుబ్రహ్మణ్య, సురసుందరి, సంగీత నృత్యకారులతో చెక్క శిల్పాలు తమ వాస్తకళా లాఘవాన్ని ప్రదర్శించారని శివనాగిరరెడ్డి వివరించారు. స్థానిక ప్రదర్శనశాలలోని శిల్పాలు, ఛాయం సోమేశ్వరాలయంలో దేశంలో ఎక్కడా లేని విధంగా శివలింగంపై నీడ (ఛాయ) పడే విధానాన్ని వివరించి, అందువల్లనే ఆ ఆలయానికి ఛాయా సోమేశ్వరాలయమని పేరొచ్చిందని డా.రెడ్డి తెలిపారు.

ఈ కార్యక్రమంలో, దక్కన్ హెరిటేజ్ ఇండియా కార్యవర్గ సభ్యులు, వారసత్వ పరిరక్షణ నిపుణులు శరశ్చంద్ర, న్యూయార్క్ సిటీ కాలేజ్ ప్రొఫెసర్, మోతీ ఆట్కెన్, అమెరికన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ట్రస్టీ, ఎలెనా వెర్నర్ పాల్గొన్నారు.

గుర్తింపుకోసం ఆరాటం

విశాలాంధ్ర-చింతూరు(అల్లూరి జిల్లా): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల అభివృద్ధి కోసం వేలకోట్లరూపాయలు ఏటా ఖర్చు చేస్తునే ఉన్నాయి. ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు బాలు వేశాయి. కానీ, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పొల్లూరు, మల్లవరం, పోరుబాయి, రాజు క్యాంప్, ఇంతూలూరువాగు, వడియక్యాంప్, ఎంసీడీసీ క్యాంప్ తదితర గ్రామాల్లో సుమారు 300 కుటుంబాలు 60 ఏళ్లుగా నివాసం ఉంటున్నాయి. వీరంతా ఎలా బతకాలో తెలియక జీలుగ కల్లు, వెదురుపనులు, పోడు వ్యవసాయం చేస్తూ చివరకు బతుకు తెరువుకోసం, గంజాయి స్మగ్లర్లు ఇచ్చి చిల్లర పైసల కోసం గంజాయి మూటలు మోస్తూ కటకటాల పాలైనవారెందరో ఈ గ్రామాల్లో ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ గెజిట్‌లో ఎస్టీ సామాజిక వర్గంలో 34 కులాలు గౌడ, నూకదొర, కొండు, వాల్మీకిలను ఎస్టీలుగా అనేక ప్రాంతాల్లో గుర్తింపునిచ్చారు. ఉద్యోగ, రాజకీయాల్లోనూ వారు రాణిస్తున్నారు. కాని ఇక్కడున్న వాళ్లంతా అనాగరింగా జీవిస్తు చీకటి బతుకుల్లో జీవిస్తూ దారిద్ర్యరేఖకు దిగువన మసకబారిపోయారు. ఇదే జాతి వారు ఇదే అల్లూరి జిల్లాలో డొంకరాయి(వై రామవరం మండలం), జీకే వీధి, ముంచింగి పుట్టు, పెదబయలు, చింతపల్లి, సీలేరు, అరకు, పాడేరుల్లో ఉన్నారు. వీరితోపాటు, బంధువులకు కూడా ఎస్టీ గుర్తింపు వచ్చింది. కానీ చింతూరు మండలంలో ఉన్న వారికి ధృవీకరణ పత్రం ఇవ్వాలంటే ఆంక్షలు ఎందుకో అర్థం కావడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు తమపై దృష్టి పెట్టాలని, ఉన్నత విద్యలకు అవకాశం కల్పించాలని ఎదురుచూస్తున్నారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభలో ఈ విషయాన్ని ఎమ్మార్వో సాయికృష్ణ, డీటీ కారం సుబ్బారావు, ఆర్ఐ దేవయ్య, వీఆర్వో వద్ద వాపోయారు.

సంపాదకీయం

దళితులకు ఉపకరించని మాయావతి వైఖరి

చాలా కాలానికి బహుజన సమాజ్ పార్టీ (బి.ఎస్.పి.) నాయకురాలు మాయావతి దీర్ఘ రాజకీయ నిద్ర నుంచి మేల్కొన్నట్టున్నారు. ఇటీవల ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికలు జరిగినప్పుడు కూడా ఆమె హడావుడి అంతగా కనిపించలేదు. ఇప్పుడు ఆమె హఠాత్తుగా వచ్చే పార్లమెంటు ఎన్నికలలో, శాసనసభ ఎన్నికలలో బీఎస్పీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ప్రకటించారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, కర్నాటక, తెలంగాణలో కూడా బీఎస్పీ ఒంటరిగానే పోటీచేస్తుందని మాయావతి ప్రకటించారు. ఈ రాష్ట్రాలలో దళితుల సంఖ్య గణనీయంగా ఉన్నప్పటికీ వారు ఎన్నడూ బీఎస్పీ మద్దతుదార్లు కారు. ఈ రాష్ట్రాలలోని దళితులు తమ ఆకాంక్షలను గుర్తించే ప్రాంతీయ పార్టీలకే మద్దతు ఇస్తున్నారు. ఆమె ఒంటరిగా పోటీ చేయాలన్న సంకల్పంతో ఇతర పార్టీలు తాము చెప్పినట్టు నడుచుకోవాలనే ఉద్దేశమే ఉంది కానీ దళితోద్ధరణకు ప్రయత్నిస్తున్నట్టుగా లేదు. బీఎస్పీని ప్రారంభించినప్పుడు కాన్షీ రాం నిర్దేశించిన లక్ష్యాలు ఇప్పుడు మాయావతి నాయకత్వంలోని బీఎస్పీలో కలికానిక్కూడా కనిపించడం లేదు. దళితుల హక్కుల పరిరక్షణకు మాయావతి గట్టిగా పోరాడిన సందర్భమే లేదు. ఆ మాటకొస్తే దోపిడీకి గురవుతున్న దళితుల ఆకాంక్షలకు అనుగుణంగా మాయావతి వ్యవహరించిన దాఖలాలే తక్కువ. అందుకే దళితులు ఆమెకు దూరం అవుతున్నారు. అగ్రవర్ణాల అణచివేత ధోరణిని ఎదిరించడానికి ఆమె ప్రయత్నించి ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేదేమో. దళిత్ పాంథర్స్ పార్టీలాగా మాయావతి నాయకత్వంలోని బీఎస్పీ విప్లవకర పోరాటాలు నేపథ్యంలోంచి ఎదిగింది కాదు. కాన్షీ రాం వెనుకబడిన, మైనారిటీ వర్గాల ఉద్యోగుల సమాఖ్య ఏర్పాటుచేసినా, బీఎస్పీలో చేరినవారిలో అత్యధికులు ఈ సమాఖ్యలో పనిచేసినవారే అయినా ఆ ఉద్యమ ఛాయలు మాయావతి హయాంలో మాయమైపోయాయి. మాయావతి దృష్టి ఎంతసేపూ ఎన్నికల్లో విజయం సాధించి నాలుగు సీట్లు సంపాదించడం మీద ఉంది తప్పితే దళితుల వాణిగా నిలవడానికి ఆమె విధానాలు ఎన్నడూ ప్రతీకగా లేవు. 2019 లోకసభ ఎన్నికల సమయంలో ఆమె అఖిలేశ్ యాదవ్ నాయకత్వంలోని సమాజ్‌వాదీ పార్టీతో పొత్తు పెట్టుకుని పది లోక్‌సభ స్థానాలు సంపాదించారు. అప్పుడు సమాజ్‌వాదీ పార్టీకి దక్కింది కేవలం అయిదు సీట్లే. అయినా సమాజ్‌వాదీ పార్టీ తమ ఓట్లను బీఎస్పీకి బదలాయించలేదని ఆరోపించి మాయావతి ఈ పొత్తును రద్దు చేసుకున్నారు. ఒకప్పుడు ఆమె కాంగ్రెస్‌తోనూ కత్తు కలిపారు. మాయావతి తనకు అనువైనప్పుడు బీజేపీతో చేయి కలిపారు. బీజేపీతో కలిసి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న సందర్భమూ ఉంది. అనువు కాదనుకున్నప్పుడు వ్యతిరేకించారు. అందుకే మాయావతి తమ వాణి వినిపిస్తుందన్న నమ్మకం దళితులు కోల్పోయారు. మాయావతి అనుసరించిన ఈ వైఖరివల్లే దళితులు బీజేపీని సమర్థించిన ఉదంతాలూ ఉన్నాయి. మాయావతి ఊగిసలాట ధోరణి అనుసరించడమే దళితులు ఆమెకు దూరం కావడానికి ప్రధాన కారణం. అదీగాక ఆమె ఎప్పుడూ దళితులందరికీ ప్రతినిధిగా వ్యవహరించలేదు. కేవలం జాతవుల నాయకురాలిగానే మిగిలిపోయారు. ఈ కారణంగా దళితులు ఆత్మరక్షణ కోసం బీజేపీకి వత్తాసుపలకడంలో ఆశ్చర్యపడాల్సింది ఏమీ లేదు.

దళితులకు మాయావతి అండ అవసరమైన సందర్భంలో ఆమె బీజేపీనే సమర్థించారు. దీనితో దళితులు సందిగ్ధావస్థలో పడిపోవలసి వచ్చింది. ఆమె వీధుల్లోకి వచ్చి దళితులకు అండగా నిలిచి అగ్రవర్ణాలవారిని ఎదిరించకపోవడంవల్ల అధికార పక్షంతో ఉండడమే మేలు అని దళితులు భావించడం సహజమైన పరిణామమే. ఉత్తరప్రదేశ్‌లో దళితుల తరపున పోరాడుతున్నది భీమ్ ఆర్మీ పార్టీ నాయకుడు చంద్రశేఖర్ ఆజాద్(రావణ్) మాత్రమే. మాయావతికి ఆయన పొడే గిట్టదు. దళితులను ఇప్పటికీ అంటరానివారిగానే పరిగణిస్తున్నారు. ఈ వైఖరిని ఎదిరిస్తున్నది రావణ్ మాత్రమే. షహరాన్ పూర్‌లో దళితులమీద హింసాత్మక దాడులు జరిగినప్పుడు 2017లో రావణ్ నాయకత్వంలోని భీమ్ ఆర్మీ పార్టీ దిల్లీలో ప్రదర్శనచేసి అందరి దృష్టినీ ఆకర్షించింది. దళితులమీద దాడి జరిగినప్పుడల్లా భీమ్‌ఆర్మీపార్టీ వారిని పరామర్శిస్తోంది. సామాజిక మాధ్యమాలలో ఈ దుర్నీతికి వ్యతిరేకంగా గొంతెత్తుతోంది. ఈ రకంగా బీఎస్పీకిఉన్న మద్దతును కొంతమేరకు భీమ్‌ఆర్మీ పార్టీ సంపాదించగలిగింది. బీమ్ ఆర్మీ పార్టీ దళితులకు సంబంధించిన అంశాలు లేవనెత్తడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా ఉపయోగిస్తోంది. బీఎస్పీకి ఉన్న ఓట్లశాతం తగ్గలేదని మాయవతి మద్దతుదార్లు ఆత్మసంతృప్తి ధోరణిలో మాట్లాడుతున్నా వాస్తవం దానికి విరుద్ధంగా ఉంది. అగ్రవర్ణాలవారు దళితులకు అండగా నిలుస్తారని ఊహించలేం కనక రావణ్‌కు మద్దతుఇవ్వక తప్పని పరిస్థితి ఉంది. అయితే ఆయనకు ధనబలం దండిగా ఉన్న పార్టీలను, ముఖ్యంగా బీజేపీని ఎదిరించే శక్తి తక్కువ. తమ తరపున గట్టిగా నిలబడిపోరాడే నాయకుడు రావణ్ అన్నది వాస్తవమే అయినా, ఆయన పార్టీ అంత బలమైంది కాకపోవడంతో దళితులు బీజేపీ వైపు చూడవలసి వస్తోంది. ఇది బీజేపీ కులసమీకరణ రాజకీయాల్లో భాగం. గత అయిదేళ్ల కాలంలో బీఎస్పీ ఇతర పార్టీలతో చేతులు కలపడానికి అనేక ప్రయత్నాలు చేసిన మాట వాస్తవం. అయితే పెద్ద ఫలితం ఏమీ కనిపించలేదు. అగ్రవర్ణాలకు, రాజకీయంగా బలంగా ఉన్న పార్టీల పంచనచేరడంవల్ల తమకు కలిగే మేలేమీలేదని దళితులు గ్రహిస్తూనే ఉన్నారు. దళితుల ప్రయోజనాలు కాపాడతామని చెప్పే మాయావతి నాయకత్వంలోని బీఎస్పీ నుంచి దళితులు ఆశించేది కేవలం ఆమెకు అధికారం దక్కడమే కాదు. తమకు ఆ పార్టీ అండగా ఉంటుందన్న విశ్వాసం కలిగించడంలో మాయావతి విఫలం అవుతూనే ఉన్నారు. ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాలలో యాదవులకు, దళితులకు లేదా ఠాకూర్లకు దళితులకు మధ్య ఘర్షణలు మామూలు అయిన స్థితిలో మాయావతి తమ పక్షాన నిలబడడం లేదన్న అసంతృప్తి దళితులలో పెరుగుతోంది. తమ మీద దాడిచేసే వర్గాలతో దళితులు రాజకీయంగానూ, సైద్ధాంతికంగానూ కలిసి నడవడం సాధ్యమయ్యే పనికాదు. దళితులకు కావలసింది తమ తరపున నిలబడే నాయకులు. మాయావతిలో ఆ లక్షణం అంతరించింది. వచ్చే సార్వత్రిక ఎన్నికలలో ప్రజావ్యతిరేకవైఖరి అనుసరిస్తున్న మోదీని ఓడించాలంటే ప్రతిపక్షాలు ఐక్యంగా పోరాడాలన్న అభిప్రాయం సర్వత్రాఉంది. ఒంటరిగా పోటీ చేయాలన్న మాయావతి వైఖరివల్ల ప్రతిపక్షాల ఓట్లు చీలి అంతిమంగా బీజేపీకే ప్రయోజనం కలగవచ్చు. ఒకప్పుడు బీఎస్పీకి 17 నుంచి 19 శాతం ఓట్లు ఉండేవి. గత ఏడాది ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో బీఎస్పీ ఓట్లు 11శాతానికి తగ్గాయి. ఒక్క సీటు మాత్రమే దక్కింది. మునుపటి మద్దతు బీఎస్పీకి తిరిగి వస్తుందనుకోవడం అత్యాశే. అంటే ఒంటరిగా పోటీ చేయడంవల్ల బీఎస్పీకి కలిగే మేలూ ఏమీ ఉండకపోవచ్చు.

మేధో వలసలు నివారించాలి

ఎంతో అభివృద్ధి చెందుతుందని అంటున్న ప్రస్తుత మన భారతదేశంనుంచి ప్రతీ సంవత్సరం లక్షలమంది భారత పౌరసత్వం వదులుకుని, విదేశాల్లో స్థిరపడేందుకు ఎక్కువ ఇష్టపడుతున్నారు. ముఖ్యంగా చదువుకున్న మేధావులు, వైద్యులు, ఇంజినీర్లు, వ్యాపార వేత్తలు ఉంటున్నారు. దీనికి ప్రధాన కారణం సమాజంలోఉన్న అసమానతలు, కులాలు, మతాలు, మూఢనమ్మకాలు, రాజకీయ నాయకులతీరు, ప్రభుత్వాల విధి విధానాలు, రకరకాల వివక్షతలు, అభద్రతాభావం, పన్నుపోటు, రెడ్ టేపిజం వంటివి మేథోవలసలకు కారణంగా ఉంది. మనదేశంలో ఎంతో పేరుప్రఖ్యాతులున్న ఉన్నత పాఠశాలలు, వర్సిటీల్లో చదువుకున్న వారు, మనదేశ ప్రజలకు, దేశాభివృద్ధికి తోడ్పడుకుండా, ఇతర దేశాల్లో స్థిరపడటానికి కారణాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా విశ్లేషణ చేయాలి. వారి తెలివితేటలు, నైపుణ్యాలు, సంపద భారత జీడీపీకి చేదోడు వాదోడుగా ఉండవలసి ఉంది. అటువంటి పరిస్థితిపోయి, ఇతర దేశాల జాతీయ ఉత్పత్తికి, ఉద్యోగ కల్పనకు పెరగడానికి కారణం అవుతున్న నేపథ్యంలో, మనదేశాన్ని మేధావులకొరత ఎన్నోఏళ్లుగా వేధిస్తున్నదని గ్రహించాలి. 2021లోనే భారత పౌరసత్వం వదులుకున్నవారు లక్ష ఆరవైవేలమంది కాగా, ఈ సంఖ్య 2022లో మరింత పెరిగి 1,80,000కి చేరింది. ఈ సంఖ్య భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశంఉంది. దీంతో మనదేశంలో నైపుణ్యాలు లేని కొరత, మేధావులు కొరత, జాతీయ స్థూల ఉత్పత్తి(జీడిపి)కి తీవ్రనష్టం వాటిల్లే అవకాశంఉంది.

ఇతర దేశాల్లో వృద్ధులు ఎక్కువగా ఉండటంతో మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి యువతులను, మేధావులను ఆకర్షిస్తూ, ఆయా దేశాల్లో పౌరసత్వం ఇవ్వడానికి అనేక రాయితీలు ఇస్తున్నారు. అందుచేతనే మనదేశంలో ప్రతిభావంతులైన వైద్యులు, ఇంజనీర్లు విదేశీ వలసబాట పడుతున్నారు. ముఖ్యంగా ఇటలీ, జపాన్‌లో 23శాతం మంది 65 సంవత్సరాల వయస్సు పైబడిన వారు కావడంతో సంతానోత్పత్తి తరుగుదల వలన ఇతర దేశాల యువతను, మేధావులను ఆకర్షిస్తూ వారి దేశాభివృద్ధికి చిత్తశుద్ధితో ముందుకు పోతున్నారు. ఆస్ట్రేలియా, యూరోపియన్ దేశాల్లో వృద్ధుల పెరుగుదలతో.. మనలాంటి దేశాల నుంచి యువతను ఆకట్టుకునే విధంగా ఆయాప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందించుకుని, ముందుకు సాగుతున్నారు. మనదేశంలో ఉన్న రాజకీయ, సామాజిక, ఆర్థిక విధానాలు కూడా మన దేశ మేధావులు మనకు దూరంగా వెళ్ళడానికి, మనదేశ పౌరసత్వం వదులుకోవడానికి సిద్ధంగా ఉంటున్నారు. ఇకనైనా ప్రభుత్వాలు వివిధ చర్యలు చేపట్టాలి. విద్య, వైద్యం, వాణిజ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. మానవవనరులు, మానవసంపద సక్రమంగా వినియోగించుకోవడంతో జీడీపీ వృద్ధి చెందుతుంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. వ్యవస్థలు రాజ్యాంగబద్దంగా పనిచేయాలి. అధికధరలు, ద్రవ్యోల్బణం వంటి వాటిని కట్టడిచేయాలి. వ్యవసాయరంగం, ఉత్పత్తి రంగాల్లో పెట్టుబడులుపెట్టి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. ధనికులు, మేధావులు దేశాన్ని విడిచి వెళ్లడంతో భవిష్యత్తులో భారత్ ఇతర దేశాలపై వివిధ అంశాల్లో ఆధారపడే స్థితివస్తుంది. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, కెనడా, జపాన్ వంటి దేశాలకు ఎక్కువగా మనదేశం నుంచి బాగా చదువుకున్నవారు, నైపుణ్యత, ధనికులు ఇతర దేశాల్లో స్థిరపడటానకి, మనదేశ పౌరసత్వం వదులుకోవడానికి వెళుతున్నారు. మేథో వలసల నియంత్రణకు మన ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా సామాజిక అసమానతలను పారద్రోలడానికి ప్రయత్నాలు ముమ్మరం చేయాలి. లౌకిక వ్యవస్థను కాపాడటంతో నేటి యువత నూతన జీవితాలకు బంగారు పునాదులు వేసుకుంటారు. రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన ఆశయాలు, రాజ్యాంగం నిర్దేశించిన పద్ధతిలో నేటిప్రభుత్వాలు పనిచేయాలి. లేనిపక్షంలో మనదేశం తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుంది....తస్మాత్ జాగ్రత్త. యువతకు మంచి భవిత కల్పించాలి.

-ఐ.పి.ఆర్.

మాంద్యంలో తక్కువస్థాయి ఉద్యోగాలు

జ్ఞాన్ పాఠక్

ప్రపంచ ఆర్థిక మాంద్యంపైనే తీవ్రస్థాయిలో చర్చలు, విశ్లేషణలు జరుగుతున్నాయి. యుద్ధం, కోవిడ్ విస్తరణ భయం తదితర కారణాలతో ఆర్థిక మాంద్యం తప్పదని నిపుణులు తెలియజేస్తున్నారు. ప్రపంచ బ్యాంకు, ఐఎమ్ఎఫ్‌లు కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నాయి. ఈ మాంద్యం సమయంలో చిన్నచిన్న ఉద్యోగాలు చేసేవాళ్లు, కార్మికులకు తక్కువస్థాయి ఉద్యోగాలు మాత్రమే లభిస్తాయని ప్రపంచ కార్మికసంస్థ (ఐఎల్ఓ) తాజాగా విడుదల చేసిన 'ప్రపంచ నిరుద్యోగం-సామాజిక దృక్పథం' స్పష్టం చేసింది. నిరుద్యోగం పెరుగుదల కొనసాగుతుంది. గౌరవనీయమైన ఉద్యోగాలు లభించడం కష్టమవుతుంది. మాంద్యంలో పెద్దపెద్ద కంపెనీలే వేలసంఖ్యలో ఉద్యోగులను ఇప్పటికే తొలగించింది. ఇంకా ఈ దిశలోనే అనేక కంపెనీలు యోచిస్తున్నాయి. తాజాగా విడుదల చేసిన ఐఎల్ఓ నివేదిక తక్కువస్థాయి ఉద్యోగాలే కాదు, అతితక్కువ వేతనాలకు కూడా పనిచేయవలసివస్తుందని తెలిపింది. అలాగే ఉద్యోగభద్రత, సామాజిక రక్షణ ఉండదని కోవిడ్-19 సంక్షోభంనాటి పరిస్థితులు తలెత్తి ఆర్థిక అసమానతలు మరింత పెరగనున్నాయి. అయితే నిరుద్యోగం రేటు 2023లో ఒకశాతం మాత్రమే ఉండవచ్చునని, 2022లో తలెత్తిన నిరుద్యోగంలో దాదాపు సగం ఉంటుందని నివేదిక పేర్కొంది. 2023లో మూడు మిలియన్ల మంది నిరుద్యోగాలను ఎదుర్కోవచ్చునని వెల్లడించింది. అంటే నిరుద్యోగం రేటు 5.8శాతం ఉండవచ్చునని ఈ నివేదిక తెలిపింది.

అత్యధిక ఆదాయం ఉండే దేశాలలో కార్మికుల లభ్యత పెరగవచ్చు. ప్రపంచ నిరుద్యోగం 2019లో ఎదురైన సంక్షోభంలో ఉన్న 16 మిలియన్ల నిరుద్యోగులు దాదాపు ఇప్పుడుకూడా అంతే ఉండవచ్చునని నివేదిక పేర్కొంది. అయితే ఉద్యోగస్థాయిమాత్రమే ఆందోళనకరంగా ఉండవచ్చునని, దానికితోడు నిరుద్యోగం కూడా ఒక శాతం పెరగవచ్చునని వెల్లడించింది. గౌరవనీయమైన ఉద్యోగం సామాజిక న్యాయానికి చిహ్నం. పేదరికం తగ్గుదలకు శతాబ్దికాలం కృషిచేసి మెరుగుపరచినప్పటికీ కొవిడ్ సంక్షోభంలో అది పూర్తిగా దిగజారిపోయింది. 2021లో కొంతమేరకు ఉద్యోగాలు పెరిగినప్పటికీ మంచి ఉద్యోగాల లభ్యత మరింత పడిపోయిందని ఈ అధ్యయనం పేర్కొన్నది. ప్రస్తుత ఆర్థిక సంక్షోభంలో కార్మికులు తక్కువస్థాయి

ఉద్యోగాలను, తక్కువ వేతనాలను అంగీకరించవలసివస్తుంది. కొన్ని సమయాల్లో తగినన్ని గంటల పనికూడా లభించకపోవచ్చు. కార్మికులకు, చిరుద్యోగులకు లభించే అతి తక్కువ వేతనాలు రోజురోజుకూ పెరుగుతున్న ధరలతో పోలిస్తే ఏ మాత్రం నేటి జీవన వ్యయానికి సమంకానేకాదు. జీవన వ్యయం భారమవుతున్న కారణంగా ఎక్కువమంది పేదరికంలోకి జారుకుంటారు. తక్కువ ఆదాయంకల దేశాలలో పరిస్థితి మరింత దిగజారిపోతున్నది. ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగం పెరుగుదలను అరికట్టేందుకు నూతన అవకాశాలను గుర్తించవలసి ఉంటుంది. నిరుద్యోగంతోపాటు ఉద్యోగాలకోసం క్రియాశీలంగా కృషిచేసే పరిస్థితి సంక్షోభ సమయంలో ఉండదు. పరిస్థితులు తల్లకిందులైన నేపథ్యంలో ఉద్యోగాలకోసం వెదకడంలోనూ నిరాశ ఏర్పడుతుంది. 2022లో ఉద్యోగిత నిరుద్యోగం మధ్య అంతరం 473 మిలియన్లు ఉంది. 2019లో అంతరం దాదాపు 33మిలియన్లు కాగా, 2022నాటికి బాగా పెరిగింది.

భౌగోళిక ఉద్రిక్తతలు, ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధం, కొవిడ్ మహమ్మారి నుంచి పుంజుకున్న పరిస్థితి అసమానంగా ఉండటం, ప్రపంచ సరఫరాల గొలుసులో ఇబ్బందులు కొనసాగడం, తక్కువస్థాయి ఉద్యోగాలకు, తక్కువ వేతనాలకు దారితీస్తున్నది. ఈ పరిస్థితులన్నీ మాంద్యోల్బణానికి దారితీస్తాయి. ఇదే సమయంలో అధిక ద్రవ్యోల్బణం, తక్కువ వృద్ధి ఉంటాయి. 1970ల తర్వాత మొదటిసారిగా ఈ పరిస్థితి తలెత్తనుంది. కార్మిక మార్కెట్‌లలో మహిళలకు, యువతకు ఉద్యోగాలు, ఆదాయం దిగజారే పరిస్థితి ఎక్కువగా ఉంటుంది. 2022లో ప్రపంచవ్యాప్తంగా మహిళలు, యువత ఉద్యోగ మార్కెట్లలో పాత్ర గణనీయంగా తగ్గిపోయింది. వీరు పాల్గొన్న రేటు 47.4శాతం మాత్రమే నమోదైంది. అదే సమయంలో పురుషుల పాత్ర రేటు కూడా 72.3శాతం ఉన్నది. 15-24ఏళ్ల మధ్య వయస్కులకు ఉద్యోగాలు, గౌరవనీయమైన ఉద్యోగాల లభ్యత తీవ్ర కష్టమైపోయింది. పెద్దవాళ్లలోకంటే మూడురెట్లు ఎక్కువగా నిరుద్యోగం చవిచూశారు. ఐదుగురిలో ఒకరికిపైగా అంటే 23.5శాతం యువత ఉద్యోగాలు చేయడంలేదు. అలాగే విద్యా రంగంలోనూ, శిక్షణారంగంలోనూ వీళ్లు లేరు. యువత గౌరవనీయ ఉద్యోగాన్ని, సామాజిక న్యాయాన్ని తక్షణం కావాలని కోరుకుంటున్నదని ఐఎల్ఓ డైరెక్టర్ జనరల్ గిల్బర్ట్ ఎఫ్ హంగ్‌బో తెలియజేశారు. అనేక సవాళ్లను ఎదుర్కొనే పరిస్థితి ఇప్పుడులేదని ప్రపంచస్థాయిలో నూతన పరస్పర, సామాజిక సంబంధాలు పెరగవలసిఉందని ఆయన చెప్పారు. ప్రపంచదేశాలన్నీ కలిసి సామాజిక న్యాయాన్ని సృష్టించాలని అవసరమైన విధానాలను రూపకల్పన చేయాలని ఆయన సూచించారు.

ప్రపంచ ఉద్యోగిత వృద్ధి మందగించిన నేపథ్యంలో కోవిడ్ 19సంక్షోభంనాటి నష్టాలు జరుగుతాయని భావించలేం. 2025 నాటికి ఈ సంక్షోభంనుంచి బైటపడవచ్చునని ఐఎల్ఓ పరిశోధనా విభాగం డైరెక్టర్ రిటైర్డ్ శామన్స్ అన్నారు.

ఆర్థికమాంద్యం కారణంగా ఉత్పాదక వృద్ధి కూడా గణనీయంగా ఆందోళన కలిగిస్తున్నది. కొనుగోలు శక్తి, వాతావరణ సుస్థిరత, మానవసంక్షేమం వంటి అంశాలలో వృద్ధిసాధించడానికి తప్పనిసరిగా ఉత్పత్తి పెరగవలసిందేనని శామన్స్ తెలిపారు. 2023లో ఆఫ్రికా, అరబ్ దేశాలలో ఉద్యోగాల వృద్ధి దాదాపు 3శాతంఉండవచ్చునని ఐఎల్ఓ నివేదిక అంచనావేసింది. ఆసియా, పసిఫిక్ లాటిన్ అమెరికా ,కరేబియన్ దేశాలలో వార్షిక ఉద్యోగిత వృద్ధి దాదాపు 1శాతం ఉండవచ్చునని ఉత్తర అమెరికా ప్రాంతంలో ఉద్యోగాల పెరుగుదల ఉండవచ్చు, ఉండకపోవచ్చునని నివేదిక పేర్కొంది. యుద్ధం కారణంగా ఐరోపా, మధ్యఆసియా ప్రాంతాలలో ఆర్థిక సంక్షోభం తీవ్రంగాఉంటుందని నివేదిక తెలిపింది.

ఐ-మెయిల్

ఉక్రోష వీరులతో ఉపద్రవం

కొంతమంది నాయకులు ఉక్రోష వీరులు. గెలిస్తే అహంకారం. ఓడిపోతే ఉక్రోషం. ఓడిపోయినప్పుడు తమలో తాము ఉడుక్కుంటే ఎవరికీ నష్టం లేదు. అలా కాకుండా వీలైనంత నష్టాన్ని అందరికీ కలిగించాలనుకుంటేనే ప్రమాదం. అలాంటి ధోరణిని ఎక్కడున్నా ఛీకొట్టి తప్పుపట్టాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యానికి, ప్రజాభిప్రాయానికి విలువనివ్వని ధోరణి సమాజానికి పెద్ద చేటు. బ్రెజిల్‌లో నిన్నటిదాకా అధ్యక్ష పీఠంపై ఉన్న మితవాది బొల్సనారో అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోయాడు. కొత్త అధ్యక్షుడిగా లూలాకి ప్రజలు తమ తీర్పు ద్వారా ఆయనకు పట్టం కట్టారు. ఓటమి రూఢి అయిన మరు క్షణమే బొల్సనారో ఎన్నికల ప్రక్రియనే తప్పుపట్టాడు. అందరూ కలిసి కుట్రచేసి తప్పుడు ఫలితాల్ని ప్రకటించారని ఆ ఫలితాల్ని నకిలీగా ప్రచారం చేసాడు. తన మద్దతుదారుల్ని రెచ్చగొట్టి తాను అమెరికా యాత్ర చేపట్టాడు. బొల్సనారో అనుచరగణం అక్కడి పార్లమెంట్‌ని, సుప్రీంకోర్టుని చుట్టుముట్టి విధ్వంసం సృష్టించింది. అయినా వారిని వారించిన పాపాన పోలేదు. పైగా మిలిటరీ కల్పించుకొని ఆయనకు మద్దతు ఇవ్వాలని పేర్కొంది. అమెరికాలో ట్రంప్ ఓడిపోయిన తర్వాత కూడా ఆయన అనుచరులు కాపిటాల్ హిల్ చేరుకొని ఇలానే రభస చేశారు. ఈ కోవకు చెందిన నేతలకు ప్రజాభిప్రాయంపై గౌరవం ఉండదు. గెలిస్తే తమ గొప్ప. ఓడితే ఎదుటివారి కుట్ర. తమ వాదనకు అనుగుణంగా అనుచరుల్ని సమాయత్తం చేస్తారు. ప్రత్యర్థుల్ని ప్రతినాయకులుగా భావించే విద్వేషపు విషాన్ని నింపుతారు.

ప్రజాస్వామిక స్ఫూర్తి పాలనలోనూ కనబడదు. నాగరిక సమాజస్థాపనపై ఆశలున్న ఎవ్వరూ ఈ దుడుకు వైఖరిని సమర్థించలేరు. అక్కడి లూలా ప్రభుత్వం ప్రజల్లో అవగాహన పెంచుతూ బొల్సనారో చర్యల్ని ఎండగట్టి, నియంత్రించాల్సిన అవసరం ఉంది. కరోనా కాలంలో అత్యధిక స్థాయిలో మరణాల్ని నమోదు చేసి, ఆర్థిక బాధల్లో ఉన్న ఆ దేశ పాలన నూతన అధ్యక్షుని నేతృత్వంలో త్వరగా గాడిలో పడాల్సిన అవసరం ఉంది. ఓటమిచెందిన నేత అనుచరగణం సాగించిన విధ్వంసాన్ని భారత్ ఖండించింది. ఎందుకంటే ఈ పెడధోరణి ప్రజాస్వామ్య విధానానికి పెను సవాల్ కాబట్టి.

డా. డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ, 94408 36931.

సీపీఐ నేత మార్టిన్ నీమోల్లర్ కాదు

వి. శంకరయ్య

తొలి ప్రపంచయుద్ధం తరువాత జర్మనీలో ఏర్పడిన అస్తవ్యస్త పరిస్థితులను ఆలంబన చేసుకొని హిట్లర్, నాజీ మూకలద్వారా సాగించిన హింసాకాండ చరిత్రపుటల్లో రక్తాక్షరాలతో లిఖించడమైంది. ఈ తరహా విధ్వంసకాండ ఇప్పటికీ వివిధదేశాల్లో వివిధరూపాల్లో భిన్న స్వభావాలతో తలెత్తుతోంది. భారత్‌లో కూడా ఈ నయా నాజీయిజం ఎప్పుడో వెళ్లూనిందని ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షులు జస్టిస్ కట్జూ నాలుగేళ్ల క్రితమే చెప్పారు. ఆనాడు జర్మనీలో ఏర్పడిన దుస్థితికి యూదులు కారణమని నాజీలు జర్మన్లను నమ్మబలికించేవారు. రాక్షసత్వాన్ని తలపించే నాజీయిజం తరహా క్రూరమైన విధానాలు ముున్ముందు ఏ దేశంలోనైనా తలెత్తితే ప్రజాస్వామ్యవాదులు ప్రేక్షకపాత్ర వహించినపుడు సంభవించే విధ్వంసకాండ క్రమం గురించి జర్మనీకి చెందిన ప్రొటెస్టెంట్ మతగురువు మార్టిన్ నీమోల్లర్ తన అనుభవాలను చరిత్రపుటల్లో శాశ్వతంగా లిఖించారు.

"నాజీలు తొలుత యూదులకోసం వచ్చారు. నేను యూదును కాదు కాబట్టి మిన్నకుండిపోయాను. తర్వాత కమ్యూనిస్టుల కోసం వచ్చారు. నేను పట్టించుకోలేదు. ఆ తర్వాత కార్మిక నాయకుల కోసం వచ్చారు. నేను ఎదురించలేదు. తదుపరి కాథలిక్కుల కోసం వచ్చారు. నేను ప్రొటెస్టెంట్. మిన్న కుండిపోయాను. ఆఖరుగా నాజీలు ప్రొటెస్టెంట్ల కోసం వచ్చారు. నన్ను కాపాడేందుకు ఎవ్వరూ మిగలి లేరని" తన వ్యథను మార్టిన్ నీమోల్లర్ గ్రంధస్థం చేశారు. నాజీయిజంలో రెండు మూడు స్వభావాలుంటాయి. కుక్కను చంపాలంటే పిచ్చిదని పేరు పెట్టాలి. ప్రజల్ని నమ్మించేందుకు ఎవరో ఒకరు బలిపశువు కావాలి. రెండు అధికార పార్టీకి, ప్రభుత్వానికి మధ్య వుండవలసిన సరళరేఖ చెరిగిపోతుంది. మూడు, అబద్ధం కూడా పదేపదే చెప్పి నిజమని నమ్మించడం. భారత్ విషయం పక్కన బెడితే ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఈ తరహా దుర్విధానాలు అమలు జరుగుతున్నాయి. జీవో నెంబరు ఒకటి జారీచేసిన తర్వాత వివిధపార్టీల నేతలకు కనువిప్పు కలిగింది. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ప్రభుత్వోద్యోగులకు చెందిన ఒక సంఘటన చెప్పడం అసందర్భం కాదు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తిరుపతి మహతి ఆడిటోరియంలో ఉద్యోగులకు చెందిన ఒక సదస్సు జరిగింది. ఈ సదస్సులో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వున్నారు. ప్రభుత్వవ్యవస్థలో అవినీతి గురించి ప్రస్తావనరాగా ఇప్పుడుకూడా ఉద్యోగులసంఘం నేతగా వుండే ఒకరు ముఖ్యమంత్రి సమక్షంలోనే ముందుగా రాజకీయ అవినీతి అరికట్టండి. ఉద్యోగుల అవినీతి దానంతట అదే రూపుమాసిపోతుందని ఉద్ఘాటించారు. మరి ఇప్పుడు ఉద్యోగసంఘాల నేతలు ప్రతినెల ఒకటవతేదీ జీతాలకోసం పడేపాట్లు ప్రత్యేకంగా చెప్పేపనిలేదు. జీవోనెంబరు ఒకటి వచ్చిన తర్వాత మిలియన్‌మార్చ్ కాదు. తమ హక్కులకోసం వీధుల్లోకి రావాలంటే పోలీసుల అనుమతికావాలి. మరీ ఉపాధ్యాయుల యెడల ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించిన క్రూరవిధానం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎరుగం.

ఇంత కథనం ఎందుకంటే పౌరహక్కులకు వాటిల్లిన భంగం గురించి వివరించడానికి మాత్రమే. పౌరహక్కులు భారతదేశ రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన హక్కు, పోలీసులు అనుమతించే భిక్షకాదు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకివచ్చిన తర్వాత స్థానికసంస్థల ఎన్నికలు జరిగాయి. అప్పుడు ఏంజరిగిందీ వివరించనక్కర లేదు. దాదాపు ఎక్కువ నియోజకవర్గాల్లో ప్రతిపక్షాలు నామినేషన్లువేసే పరిస్థితి లేక పోయింది. ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించ దలచిన రమేష్‌కుమార్ ఎపిసోడ్ వివరించనక్కర లేదు. ప్రజాస్వామ్యం పరిహాసమైంది. పౌరహక్కులు హరించడమైంది. ఈ సందర్భంలో ఎవరునోరు తెరచినా వారిని చౌదరిగానూ, చంద్రబాబు నాయుడు ఏజంట్‌గానూ ముద్ర వేశారు. ఈ సమయంలోనే విశాఖ పర్యటనకు వెళ్లిన ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడును పర్యటనకు వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. ఈ సమయంలో రాష్ట్ర సీపీఐ కార్యదర్శి రామకృష్ణ ఒక్కరే వైజాగ్ వెళ్లి చంద్రబాబు నాయుడుకు సంఘీభావం ప్రకటించారు. దీని పర్యావసానమేమంటే బీసీ వర్గానికి చెందిన రామకృష్ణకు చౌదరి తగిలించి సోషల్ మీడియాలో ట్రోల్‌చేశారు. రాష్ట్రంలోని ఇతర రాజకీయపార్టీలు స్థానిక ఎన్నికల్లో జరిగిన దాడులుగురించి, వైజాగ్‌ఎయిర్‌పోర్ట్‌లో చంద్రబాబు నాయుడును అడ్డుకోవడం, కేవలం వైసీపీ, తెలుగుదేశం రెండు పార్టీల మధ్య తగాదాగానే చూశాయి గాని తత్ఫలితంగా పౌరహక్కులు కాలరాస్తున్నట్లు భవిష్యత్తులో జర్మనీలో ప్రొటెస్టెంట్ మతగురువు మార్టిన్ నీమోల్లర్‌కు పట్టిన దుర్గతి తమకూ పడుతుందని ఊహించలేకపోవడమే. రెండుసంవత్సరాల కాలంలో ప్రజాఉద్యమాలు అణచివేయడం, ఆఖరుగా జీవోనెంబరు ఒకటి జారీచేసిన తర్వాతగాని చాలమంది ముున్ముందు రానున్న ప్రమాదం పసిగట్టలేకపోయారు.

ఇప్పుడుకూడా సీపీఐనేత రామకృష్ణ ముందడుగు వేశారు. జీవో నెంబరు ఒకటి జారీ చేసిన తదుపరి ముున్ముందు ప్రజాస్వామ్యవ్యవస్థకు రానున్న పెనుముప్పుఊహించి మార్టిన్ నీమోల్లర్‌గా వేచిచూడలేదు. అన్నివ్యవస్థలు చేతులెత్తేసిన నేపథ్యంలో మిగిలిన ఒక్క న్యాయవ్యవస్థను ఆశ్రయించి తాత్కాలికంగా ప్రజాఉద్యమాలకు ఉపశమనం కలిగించారు. అదే సమయంలో ప్రజా క్షేత్రంలో పోరాటాలకు శ్రీకారం చుట్టారు. జీవోనెంబరు ఒకటి జారీ చేసిన తర్వాత నాజీ జర్మనీ మతగురువు మార్టిన్ నీమోల్లర్ లాగా తనకూ పట్టనట్లు సీపీఐ నేత రామకృష్ణ కూడా ఆలోచించివుంటే ఆనాడు విశాఖపట్నం విమానాశ్రయంలో చంద్రబాబు నాయుడును నిలువరించినపుడు వైజాగ్ వెళ్లి సంఘీభావం ప్రకటించి వుండేవారు కాదు. మిగిలిన ఒకవ్యవస్థ న్యాయస్థానం తలుపుతట్టి ప్రజాస్వామ్యం మెడపై పెట్టిన కత్తి తాత్కాలికంగానైనా తొలిగించి ప్రజాస్వామ్యం పరిరక్షణకు తలపడ్డారు. కాబట్టే ప్రజాస్వామ్య శక్తులకు ఊరట కలిగింది.

అందరిలాగే ఖండన మండనలతో సరిపెట్టకుండా హైకోర్టు మెట్లెక్కినాడు కాబట్టి ఈరోజు ప్రజాస్వామ్య పరిరక్షణలో హీరో అయ్యారు. ఈ మూడేళ్లకాలంలో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నత న్యాయస్థానాల్లో ఎన్నోతీర్పులు వచ్చాయి. అయితే జీవోనెంబరు ఒకటి నిలుపుదలచేస్తూ చేసిన తీర్పుతో పోల్చుకుంటే అవన్నీ బలాదూరే! పాపం క్షమించుగాక!

విశ్రాంత పాత్రికేయులు, 9848394013

ప్రభుత్వ విధుల్లో జోక్యమేంటి?

- టీచర్ల ఫిన్లాండ్ పర్యటనను అడ్డుకుంటారా
- లెఫ్టినెంట్ గవర్నరు సక్సేనాపై కేజ్రీవాల్ మండిపాటు
- ఎల్‌జీ కార్యాలయానికి భారీ ర్యాలీ
- అడ్డుకున్న పోలీసులు

న్యూదిల్లీ: దిల్లీ లెఫ్టినెంట్ గవర్నరు వీకే సక్సేనా, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) మధ్య ఘర్షణ కొనసాగుతోంది. ప్రభుత్వానికి, దాని విధులకు అడుగడుగునా అడ్డుతగులుతున్న వీకే సక్సేనాపై ఆప్ మండిపడుతోంది. విమర్శల దాడి కొనసాగిస్తోంది. లెఫ్టినెంట్ గవర్నరు చర్యలను ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని తేల్చిచెబుతోంది. తాజాగా సోమవారం వీకే సక్సేనాకు వ్యతిరేకంగా దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా నేతృత్వంలో ఆప్ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు ఎల్‌జీ కార్యాలయానికి ప్రదర్శనగా బయలుదేరారు. శిక్షణ కోసం ఉపాధ్యాయులను ఫిన్లాండ్ పంపించాలన్న కేజ్రీవాల్ ప్రభుత్వ ప్రతిపాదనను వీకే సక్సేనా వ్యతిరేకించడాన్ని నిరసిస్తూ భారీ ర్యాలీ చేపట్టారు. అయితే, ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకించలేదని, దీనిని మరింత అభివృద్ధి చేయాలని మాత్రమే సలహా ఇచ్చినట్లు ఎల్‌జీ కార్యాలయం చెప్పుకొచ్చింది. దిల్లీ అసెంబ్లీ వాయిదా పడిన తర్వాత ఎమ్మెల్యేలతో కలిసి కేజ్రీవాల్ ర్యాలీ ప్రారంభించారు. భారీ భద్రత మధ్య ర్యాలీ రెండు కిలోమీటర్లు సాగింది. ఎల్‌జీ కార్యాలయానికి కొద్ది మీటర్ల దూరంలో ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. ఆప్ ఎమ్మెల్యేలు అక్కడే ధర్నా చేసి...వీకే సక్సేనాను కలవాలని డిమాండ్ చేశారు. 'మీతోనూ, మీ డిప్యూటీతోనూ కలవడానికి సక్సేనా సుముఖంగా ఉన్నారు' అంటూ లెఫ్టినెంట్ గవర్నరు కార్యాలయం నుంచి కేజ్రీవాల్‌కు సమాచారం వచ్చింది. తనతోనూ, ఉపముఖ్యమంత్రితోనూ సమావేశం కావడానికి గవర్నరు సిద్ధంగా ఉన్నట్లు కేజ్రీవాల్ సైతం ధృవీకరించారు. అయితే, సమావేశంలో తమ ఎమ్మెల్యేలు కూడా పాల్గొనేందుకు అనుమతించాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ధర్నా చేసిన ఆప్ ఎమ్మెల్యేలు తిరిగి అసెంబ్లీకి చేరుకున్నారు. లెఫ్టినెంట్ గవర్నరును కలిసేందుకు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు రోడ్డుపై వేచి ఉన్నా ఆయన అంగీకరించకపోవడం దురదృష్టకరమని కేజ్రీవాల్ విమర్శించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులను ఫిన్లాండ్‌కు పంపాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను లెఫ్టినెంట్ గవర్నరు తిరస్కరించారని ఆప్ ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు. తమ ప్రతిపాదనకు అంగీకారం తెలపాలని సక్సేనాకు విజ్ఞప్తి చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. దిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ ఎమ్మెల్యేలు ఎల్‌జీ కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్లడం విచారకరమని, సక్సేనా తన తప్పు తెలుసుకొని...ఉపాధ్యాయులను ఫిన్లాండ్ పంపడానికి అంగీకరిస్తారని భావిస్తున్నట్లు కేజ్రీవాల్ చెప్పారు. వీకే సక్సేనా స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవడం లేదని, ఆయన కేంద్రం పెద్దలు చెప్పినట్లు నడుచుకుంటున్నారని విమర్శించారు. ర్యాలీ ఆపిన అనంతరం కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడుతూ ఎల్‌జీపై నిప్పులు చెరిగారు. దిల్లీ ప్రభుత్వ చర్యలకు రాజకీయాలు ఆపాదిస్తున్నారని మండిపడ్డారు. తమ హోంవర్క్‌ను తనిఖీ చేయడానికి లెఫ్టినెంట్ గవర్నరు హెడ్‌మాస్టర్ కాదని స్పష్టంచేశారు. తమ ప్రతిపాదనలకు ఆయన అవును...కాదు అని చెప్పడమే ఆయన విధి అని పేర్కొన్నారు. నిర్ణయాలు తీసుకునే అధికారం లేకపోతే ప్రజలతో ఎన్నికైన ప్రభుత్వం ఎలా పనిచేస్తోందని కేజ్రీవాల్ నిలదీశారు. ఫిన్లాండ్‌కు వెళ్లకుండా తమ ఉపాధ్యాయులను ఎందుకు నిలిపివేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 'ఫిన్లాండ్‌లో ఉత్తమ విద్యా వ్యవస్థ ఉంది. మేము ఇక్కడ వేచిచూస్తున్నాం. మా పిల్లల భవిష్యత్ కోసం మేము పోరాటం చేస్తున్నాం' అని కేజ్రీవాల్ పీటీఐతో చెప్పారు. ప్రభుత్వ వ్యవహారాల్లో లెఫ్టినెంట్ గవర్నరు సక్సేనా మితిమీరిన జోక్యం, చట్టవిరుద్ధంగా, అవాంఛిత అభ్యంతరాలపై ఆప్, బీజేపీ ఎమ్మెల్లేల మధ్య మాటలయుద్ధం జరిగిన తర్వాత అసెంబ్లీ వాయిదా పడింది. ఆ తర్వాత సక్సేనా కార్యాలయానికి ఆప్ ఎమ్మెల్యేలు ర్యాలీ నిర్వహించారు.

4 రోజుల్లో గమ్యానికి వివేక్ ఎక్స్‌ప్రెస్

న్యూదిల్లీ: భారతీయ రైల్వేలలో అత్యంత సుదీర్ఘ ప్రయాణం చేసే రైలు వివేక్ ఎక్స్‌ప్రెస్. ఈ రైలు బయలు దేరిన స్థలం నుంచి గమ్యస్థానం చేరుకునేందుకు నాలుగు రోజులు పడుతుంది. అస్సోంలోని డిబ్రుఘడ్ - తమిళనాడులోని కన్యాకుమారి మధ్య ఈ రైలు రాకపోకలు సాగిస్తుంటుంది. ఈ రెండు రైల్వే స్టేషన్ల మధ్య దూరం 4,218 కిలోమీటర్లు. డిబ్రుఘడ్ నుంచి ప్రతి శనివారం బయలుదేరి సుమారు 80 గంటలు (మొత్తం నాలుగు రోజులు) ప్రయాణించి గమ్యస్థానాన్ని చేరుకుంటుంది. ఈ రైలు అస్సోం, నాగాలాండ్, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్‌సహా ఎనిమిది రాష్ట్రాల మీదగా ప్రయాణిస్తుంది. దాదాపు 58 రైల్వేస్టేషన్లలో ఈ రైలు ఆగుతుంది. ఈ రైలులో ఇంజిన్‌తోపాటు మూడు జనరల్ కోచ్‌లు, 11 స్లీపర్ కోచ్‌లు, నాలుగు త్రీటైర్ ఏసీ కోచ్‌లు, ఒక టూటైర్ ఏసీ కోచ్, ఒక ప్యాంట్రీ ఉన్నాయి. 2011-12 రైల్వే బడ్జెట్‌లో అప్పటి రైల్వేశాఖ మంత్రి మమతా బెనర్జీ ఈ రైలు గురించి ప్రకటన చేశారు. 2013లో స్వామి వివేకానంద 150వ జయంతి సందర్భంగా జనవరి 12న ఈ రైళ్లను పచ్చాజెండా ఊపి ప్రారంభించారు. నిర్విరామంగా రాకపోకలు సాగిస్తున్న ఈ రైలు సర్వీసుకు కరోనా సమయంలో బ్రేక్ పడింది. కరోనా లాక్‌డౌన్ నేపథ్యంలో రైల్వేశాఖ అన్ని రైళ్ల సర్వీసులను నిలిపివేసింది. అలా నిలిచిపోయిన ఆఖరి రైలు వివేక్ ఎక్స్‌ప్రెసే.

వణుకుతున్న ఉత్తరభారత్

దిల్లీలో ఎల్లో అలర్ట్ జారీ

న్యూదిల్లీ: ఉత్తర భారతదేశం చలికి గజగజ వణికిపోతోంది. గత కొన్ని రోజులుగా ఉత్తరాది రాష్ట్రాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దేశ రాజధాని దిల్లీలో ఉష్ణోగ్రతలు భారీగా పతనమవుతున్నాయి. నేటి నుంచి వరుసగా మూడు రోజుల పాటు మరో కోల్డ్ స్పెల్ ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఇప్పటికే హెచ్చరించింది. మూడు డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. రానున్న ఐదు రోజుల్లో దిల్లీ సహా పంజాబ్, హర్యాణా, చండీగఢ్, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో దట్టమైన మంచు కురిసే అవకాశాలు ఉన్నట్లు ఐఎండీ వెల్లడించింది. వాయువ్య ప్రాంతం మీదుగా వీస్తున్న చలిగాలుల వల్ల జనవరి 18 వరకు ఆయా ప్రాంతాల్లో రెండు నుంచి మూడు డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తెలిపింది. తాజా పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. కాగా, సోమవారం ఉదయం దిల్లీలో కనిష్ఠ ఉష్ణోగ్రత 1.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. దీంతో ప్రజలు చలికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సీజన్‌లో ఇంత తక్కువ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఇదే తొలిసారి. దీంతో దిల్లీలో నేటి నుంచి మరో ఆరురోజులపాటు ఐఎండీ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. సోమవారం ఉదయం దిల్లీలోని సఫ్దర్‌జంగ్ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు 1.4 డిగ్రీల సెల్సియస్‌గా, లోధి రోడ్డులో 1.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. మరోవైపు దిల్లీ పరిసర ప్రాంతాల్లో దట్టంగా అలముకొన్న పొగమంచు కారణంగా 13 రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నట్లు ఇండియన్ రైల్వేస్ ప్రకటించింది. అనేక విమానాలు సైతం ఆలస్యంగా నడుస్తున్నట్లు ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. ఈ నెల 5 నుంచి 9వ తేదీ మధ్య ఏర్పడిన కోల్డ్ స్పెల్ కారణంగా దిల్లీ పరిసర ప్రాంతాల్లో వరుసగా అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గడిచిన పదేళ్లలో ఇంతటి తక్కువ స్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఇది రెండోసారి. ఐఎండీ తాజాగా వెల్లడించిన వివరాల ప్రకారం గడిచిన 15 రోజుల్లో 50 గంటలపాటు పొగమంచు కురిసింది. 2019 తర్వాత ఇంత పెద్ద మొత్తంలో మంచు కురవడం ఇదే తొలిసారి.

జల్లికట్టులో 75 మందికి గాయాలు

మధురై: తమిళనాడులోని మదురైలో జల్లికట్టు కార్యక్రమంలో దాదాపు 75 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన 20 మందిని మధురైలోని ప్రభుత్వ రాజాజీ ఆసుపత్రికి పంపగా, 11 మంది ఇంకా అక్కడ చికిత్స పొందుతున్నారని రెవెన్యూ శాఖ అధికారి ఒకరు తెలిపారు. స్వల్ప గాయాలపాలైన మరో 50 మందికి ప్రథమ చికిత్స అందించారు. పొంగల్ సందర్భంగా తమిళనాడులో సాంప్రదాయక జల్లికట్టు కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటగా రాష్ట్రంలోని మధురైలోని అవనియాపురంలో జల్లికట్టు కార్యక్రమం జరిగింది. పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. దాదాపు పోటీలో 800 మందికి పైగా వ్యక్తులు పాలుపంచుకున్నారు. ఎద్దులను పట్టుకోవడానికి తీవ్రంగా శ్రమించారు. ఈ క్రమంలోనే అనేకమంది తీవ్రంగా గాయపడ్డారు. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని మధురై జిల్లా కలెక్టర్ అనీష్ శేఖర్ తెలిపారు. జల్లుకట్టు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్టు పూర్కొన్నారు. ప్రేక్షకులతో పాటు క్రీడలో పాల్గొనేవారి భద్రత కోసం అన్ని ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. కార్యక్రమం మొదలైనప్పిటి నుంచి అందులో పాలుపంచుకున్న వారు గాయపడుతున్నప్పటికీ.. జల్లికట్టు కార్యక్రమం ఆదివారం సాయంత్రం 4 గంటల వరకు కొనసాగిందని అధికారులు తెలిపారు. ఇతర ప్రాంతాల్లో జరగబోయే జల్లికట్టు కార్యక్రమం గురించి మాట్లాడుతూ... 'ఎలాంటి గాయాలు కావని ఆశిస్తున్నాం. గాయాలు అయితే, వారికి ఉత్తమ వైద్య సంరక్షణ అందించేలా చూడాలనుకుంటున్నాము. అందుకని అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. జల్లికట్టు సజావుగా జరుగుతుందని ఆశిస్తున్నాం' అని మధురై కలెక్టర్ పేర్కొన్నారు.

క్రికెటర్ల కుమార్తెలపై అనుచిత వ్యాఖ్యలు... ఎఫ్ఐఆర్ నమోదు

న్యూదిల్లీ: భారత క్రికెటర్లు విరాట్ కోహ్లీ, ఎంఎస్ ధోనీల కుమార్తెలపై సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై గుర్తుతెలియని వ్యక్తులపై దిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని దిల్లీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ స్వాతి మలివాల్ సోమవారం తెలిపారు. ఈ మేరకు ఆమె ట్విట్టర్‌లో ఎఫ్ఐఆర్ కాపీని పోస్ట్ చేశారు. నిందితులను త్వరలో అరెస్టు చేస్తామని చెప్పారు. 'నా దృష్టికి వచ్చిన తర్వాత ధోనీ కుమార్తెలపై చేసిన అనుచిత వ్యాఖ్యల కేసులో దిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అతి త్వరలో దోషులందరినీ అరెస్టు చేసి కటకటాల వెనక్కి పంపుతారు' అని ఆమె హిందీలో ట్వీట్ చేశారు.

ఉపాధి నిధుల పంపిణీలో బెంగాల్‌పై కేంద్రం వివక్ష: మమత

సాగర్దిఘి: ఉపాధిహామీ పథకం నిధుల పంపిణీలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంపై వివక్ష చూపుతోందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విమర్శించారు. ఈ పథకానికి సంబంధించి కేంద్రం పశ్చిమ బెంగాల్‌కు రూ.6వేల కోట్లు బకాయిపడిందని ఆమె పేర్కొన్నారు. 'కేంద్ర ప్రభుత్వం పశ్చిమ బెంగాల్‌కు ఎంజీఎన్ఆర్ఈజీపీ నిధులను విడుదల చేయడం లేదు. మాకు రూ. 6వేల కోట్లు బకాయి ఉంది. బీజేపీ పాలిత రాష్ట్రాలు మాత్రం 100 రోజుల పని పథకానికి నిధులు పొందుతున్నాయి' అని ఆమె అన్నారు. ముర్షిదాబాద్ జిల్లాలోని సాగర్దిఘిలో సోమవారం అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ఉపాధి హామీ పథకం అమలులో మొదటి స్థానంలో ఉన్నప్పటికీ పశ్చిమ బెంగాల్ వివక్షను ఎదుర్కొంటోందన్నారు. తాము ఎటువంటి కేంద్ర సహాయం లేకుండానే పథకాన్ని అమలు చేస్తున్నామని మమత తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో వివిధ పథకాల అమలును పర్యవేక్షించేందుకు రాష్ట్రానికి కేంద్ర బృందాల పర్యటనలపై ఆమె స్పందిస్తూ... రాష్ట్ర ప్రభుత్వాన్ని వేధించడానికి వారిని పంపుతున్నారని ఆరోపించారు. 'బీజేపీ నేత ఇంట్లోకి తుమ్మెద వచ్చినా పశ్చిమ బెంగాల్‌కు కేంద్ర బృందాన్ని పంపిస్తారు... అలాంటి బృందాలను ఉత్తరప్రదేశ్, దిల్లీ, గుజరాత్‌లకు ఎందుకు పంపరు? చిన్న విషయాలకే కేంద్ర బృందాలను పంపి కేంద్రం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని వేధిస్తోంది' అని మమత విమర్శించారు.

అగ్నివీరులతో సాయుధ దళాల బలోపేతం

ప్రధాని నరేంద్ర మోదీ

న్యూదిల్లీ: అగ్నివీరుల రాకతో సాయుధ దళాలు సాంకేతికంగా మరింత బలోపేతం అవుతాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అగ్నిపథ్ పథకం కింద వివిధ సైనిక విభాగాల్లో ఎంపికైన తొలి విడత అగ్ని వీరులను ప్రధాని సోమవారం వర్చువల్‌గా కలుసుకున్నారు. త్రివిధ దళాల్లో స్వల్పకాలిక సైనిక సేవల కోసం ఎంపికైన అభ్యర్థులతో ప్రధాని మాట్లాడారు. రాబోయే కాలంలో అగ్ని వీరులు సాయుధ దళాల్లో కీలక పాత్ర పోషించి, బలగాలను మరింత బలోపేతం చేస్తారని మోదీ అన్నారు. రాబోయే తరాలకు ఈ మొదటి అగ్నివీర్ బ్యాచ్ మార్గనిర్ద ర్దేశర్దేకులుగా ఉండాలంటూ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కూడా పాల్గొన్నారు. 'విప్లవాత్మక మార్పునకు మార్గనిర్దేశకులుగా ఉన్నం దుకు మీ అందరికీ అభినందనలు. అగ్నిపథ్ పథకం పారదర్శకమైంది. యువ అగ్నివీరులు సాయుధ దళాలకు సాంకేతికపరంగా మరింత బలాన్ని చేకూరుస్తారు. సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వీరు త్రివిధ దళాల్లో కీలక పాత్ర పోషిస్తారు. ఈ తరం యువతకు ఆ శక్తి సామర్థ్యాలు ఉన్నాయి. రాబోయే కాలంలో అగ్నివీరులు బలగాల్లో ముఖ్యపాత్ర పోషిస్తారు. వీరి రాకతో సైన్యం మరింత చైతన్యం తో నిండిపోయింది. 21వ దశాబ్దంలో యుద్ధాలు జరిగే విధానం పూర్తిగా మారిపోతుంది. త్రివిధ దళాల్లో మహిళా అగ్నివీరులను చూడాలని ఎదురుచూస్తున్నాను. వారు వివిధ రంగాల్లో సాయుధ బలగాలకు నాయకత్వం వహిస్తున్నందున చాలా సంతోషంగా ఉంది. ప్రస్తుతం సియాచిన్‌లో మహిళలు యుద్ధ విమానాలు నడుపుతున్నారు' అన్నారు.

అగ్నివీరులు వివిధ ప్రాంతాలలో వివిధ ప్రాంతాల్లో పనిచేయాల్సి వివిధ బాషలు, సంస్కృ తులు, జీవన విధానాలను తెలుసుకోవాలని వారికి సూచించారు. ఎంచుకున్న రంగాల్లో నైపుణ్యాలను మెరుగుపరచుకుంటూ.. కొత్త విషయాలు తెలుసుకునే ఆసక్తి కలిగి ఉండాలని చెప్పారు.

గుజరాత్‌లో ఆరుగురి ప్రాణం తీసిన గాలిపటాలు

176 మందికి గాయాలు

అహ్మదాబాద్: గుజరాత్‌లో ఉత్తరాయణ పండుగ సందర్భంగా గాలిపటాలు ఎగురవేస్తుండగా చోటు చేసుకున్న ఘటనల్లో ఆరుగురు మృతి చెందగా, 176 మంది గాయపడినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. పండుగ సందర్భంగా పిల్లలు, యువకులు పెద్దసంఖ్యలో డాబాలు, పైకప్పులపై ఎక్కి గాలిపటాలు ఎగరేశారు. అయితే అనేక చోట్ల గాలిపటాలు ఎగరేయడానికి పదునైన దారాలను ఉపయోగించారు. అవి బాధితుల మెడకు చుట్టుకుని రక్తస్రావం అయ్యే విధంగా గొంతును చీరేసినట్లు అధికారులు తెలిపారు. భావ్‌నగర్ నగరంలో ద్విచక్ర వాహనంపై తన తండ్రితో కలిసి వెళుతున్న రెండేళ్ల చిన్నారి కీర్తి మెడకు గాలిపటం దారం చుట్టుకుపోయి గొంతుకు తీవ్ర గాయమైంది. ఆమె ఆదివారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిందని బోర్తలావ్ పోలీస్ స్టేషన్ అధికారి తెలిపారు. శనివారం జరిగిన మరో సంఘటనలో కిస్మత్ (3) విస్‌నగర్ పట్టణంలోని తన తల్లితో కలిసి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా గాలిపటం దారం ఆమె మెడను కోసింది. బాలికను ఆసుపత్రికి తరలించగా, వైద్యులు ఆమె చనిపోయినట్లు నిర్ధారించారని విస్‌నగర్ పోలీసు అధికారి తెలిపారు. అదేవిధంగా ఏడేళ్ల రిషబ్ వర్మ తన తల్లిదండ్రులతో కలిసి గాలిపటం కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా, రాక్జోత్‌లో అతని మెడకు గాలి పటం దారం చుట్టుకుపోయి కోసేసినట్లు అజీ డ్యామ్ పోలీస్‌స్టేషన్ అధికారి తెలిపారు. వడోదర, కచ్, గాంధీనగర్ జిల్లాల్లో ఇలాంటి సంఘటనలు నమోదయ్యాయి. ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్నప్పుడు గాలిపటం దారాలు మెడకు పట్టుకుని కోసుకుపోవడంతో ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. బ్రిడ్జిపై ద్విచక్రవాహనంపై వెళుతుండగా మెడకు దారం తగిలి స్వామీజీ యాదవ్ (35) మృతి చెందగా, ఇదే విధంగా కచ్ జిల్లా గాంధీధామ్ నగరం, గాంధీనగర్ జిల్లా కలోల్ పట్టణంలో నరేంద్ర వాఘేలా (20) మృతి చెందారు. 108-ఇఎంఎస్ అత్యవసర అంబులెన్స్ సర్వీస్ అందించిన సమాచారం ప్రకారం... శని, ఆదివారాల్లో గాలిపటాలు ఎగురవేస్తుండగా ఎత్తు నుంచి కిందపడి మొత్తం 130 మందికి, దారం కోసుకుపోయి 46 మందికి గాయాలయ్యాయి. రోడ్డు ప్రమాదాల సంఖ్య కూడా పెరిగింది, జనవరి 15న 461 కేసులు, జనవరి 14న 820 కేసులు నమోదయ్యాయి.

ఏ పార్టీతో పొత్తులుండవ్: మాయావతి

లక్నో: రాబోయే సాధారణ ఎన్నికల్లో, ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని బహుజన్ సమాజ్‌వాది పార్టీ (బీఎస్పీ) అధ్యక్షురాలు మాయావతి చెప్పారు. తాము ఏ పార్టీతోనూ పొత్తుపెట్టుకో బోమని ఆమె తెగేసి చెప్పారు. కాంగ్రెస్‌తోపాటు మరికొన్ని ఇతర పార్టీలు తమతో పొత్తుకు ప్రయత్నిస్తున్నాయని, కానీ ఆ విషయంలో తమ విధానాలు పూర్తి భిన్నంగా ఉన్నదని తెలిపారు. ఈవీఎంల గురించి కూడా మాయావతి మాట్లాడారు. ఈవీఎంలలో ఏదో లోపం ఉన్నదని అనుమానం వ్యక్తంచేశారు. బ్యాలట్ పేపర్ టైమ్‌లో తమ పార్టీ సీట్ల సంఖ్య, ఓట్ల శాతం ఎన్నిక ఎన్నికకూ పెరుగుతూ ఉండేదని చెప్పారు. ఇకనైనా ఎన్నికలను బ్యాలట్ పద్ధతిలోనే నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు.

31నుంచి రాజ్యసభ సమావేశాలు

న్యూదిల్లీ: రాజ్యసభ సమావేశాలు (259వ సెషన్) జనవరి 31న ప్రారంభమై ఏప్రిల్ 6న ముగుస్తాయని రాజ్యసభ సెక్రటేరియట్ ఒక ప్రకటనలో తెలిపింది. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు జనవరి 31న ప్రారంభం కానున్నాయి. ఆ రోజున ఉభయ సభల (రాజ్యసభ, లోక్‌సభ)నుఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. ఈ సెషన్‌లో 27 సమావేశాలు జరుగుతాయని, బడ్జెట్ పత్రాలను పరిశీలించేందుకు నెల రోజుల విరామంతో ఏప్రిల్ 6 వరకు సమావేశాలు కొనసాగుతాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ 2023-24ను ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్ సెషన్ మొదటి భాగం ఫిబ్రవరి 13న ముగుస్తుందని తెలిపారు. బడ్జెట్ సెషన్ రెండో విడత కోసం పార్లమెంట్ మార్చి 13న తిరిగి సమావేశమవుతుంది.

కర్ణాటకలో అవినీతి రాజ్యమేలుతోంది: ప్రియాంక

బెంగళూరు: కర్ణాటకలో అవినీతి రాజ్యమేలుతోందంటూ అక్కడి బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా ధ్వజమెత్తారు. సోమవారంనాడిక్కడి ప్యాలెస్ గ్రౌండ్స్‌లో కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) నిర్వహించిన 'నా నాయకి' కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, కర్ణాటకలో పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉన్నదని, అవినీతి కారణంగా రాష్ట్రం రూ.1.5 లక్షల కోట్లు నష్టపోయిందని తాను ఇక్కడికి రావడానికి ముందే విన్నానని చెప్పారు. పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ రిక్రూట్‌మెంట్ స్కామ్ సిగ్గుచేటని, అధికారంలో ఉన్న రాజకీయ నాయకులు ఏం చేస్తున్నారో మీరు మీ పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలని ఆ సభకు వచ్చిన ప్రజలకు ప్రియాంకా సూచించారు. ఐదేళ్ల బీజేపీ పాలనలో మీ జీవితాలేమైనా బాగుపడ్డాయా..?, మీ జీవితంలో ఏదైనా మార్పు జరిగిందా..? అని ప్రశ్నించారు. ఐదేళ్ల క్రితం ఓటు వేయకముందు మీ జీవితం ఎలా ఉందో.. ఇప్పుడు ఎలా ఉందో.. ప్రతి ఒక్కరూ ఒకసారి తరచి చూసుకోవాలని, అప్పుడే బీజేపీ నిర్లక్ష్యం అర్థమవుతుందని ప్రియాంక చెప్పారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ప్రతి గృహిణికి నెలకు రూ.2000 ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి ప్రియాంకవాద్రా హామీ ఇచ్చారు. 'గృహ లక్ష్మి' పథకం పేరుతో చేపట్టే ఈ పథకం వల్ల 1.5 కోట్ల మంది గృహిణులకు లబ్ధి చేకూరుతుందని కేపీసీసీ తెలిపింది. మే నాటికి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రంలోని అన్ని గృహాలకు ప్రతి నెలా 200 యూనిట్లు కరెంట్ ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చిన కొద్ది రోజులకే కాంగ్రెస్ పార్టీ ఈ పథకాన్ని ప్రజల ముందుకు తెచ్చింది.

ఈడీ విచారణకు 2వారాల గడువు కోరిన కాంగ్రెస్ ఎమ్మెల్యే

రాంచీ: నగదు తరలింపు కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముందు హాజరయ్యేందుకు జార్ఖండ్‌లో బహిష్కృత కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజేష్ కచ్ఛప్ రెండు వారాల సమయం కోరారు. ఇదే కేసులో జనవరి 13న మరో బహిష్కృత కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇర్ఫాన్ అన్సారీ కూడా ఆరోగ్య కారణాలపై ఈడీ విచారణకు హాజరవడానికి రెండు వారాల గడువు కోరారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇర్ఫాన్ అన్సారీ, నమన్ బిక్సాల్‌తో కలిసి ఆయన ప్రయాణిస్తున్న కారు నుంచి నగదు స్వాధీనానికి సంబంధించి కచ్ఛప్‌ను ఈడీ విచారణకు పిలిచిందని ఒక అధికారి తెలిపారు. గత ఏడాది జులైలో హౌరా జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేల వాహనం నుంచి రూ.49 లక్షల నగదు స్వాధీనం చేసుకున్న తర్వాత పశ్చిమ బెంగాల్ పోలీసులు వారిని అరెస్టు చేశారు. కచ్ఛప్ పీటీతో ఫోన్‌లో మాట్లాడుతూ... 'నేను ఇప్పుడు ముందుగా షెడ్యూల్ చేసిన కార్యక్రమం కోసం దిల్లీలో ఉన్నాను. ముగ్గురు ఎమ్మెల్యేల కేసును చూస్తున్న మా న్యాయవాది చంద్ర భాను సింగ్ ఈరోజు ఈడీ కార్యాలయాన్ని సందర్శించి మరికొంత సమయం కావాలని అభ్యర్థించారు. జనవరి 26 తర్వాతి తేదీ కోసం ఈడీని కోరాం' అని తెలిపారు. డిసెంబర్ 24న ఈ కేసుకు సంబంధించి కాంగ్రెస్ ఎమ్మెల్యే కుమార్ జైమంగళ్ సింగ్ అలియాస్ అనూప్ సింగ్‌ను ఈడీ తొమ్మిది గంటలకు పైగా ప్రశ్నించింది. జార్ఖండ్‌లో జేఎంఎం నేతృత్వంలోని హేమంత్ సోరెన్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ముగ్గురు ఎమ్మెల్యేలు తనకు రూ.10 కోట్లు, మంత్రి పదవి ఇస్తామని ఆఫర్ చేశారని ఆరోపిస్తూ సింగ్ రాంచీలోని అర్గోరా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో తనను నిందితుడిగా కాకుండా ఫిర్యాదుదారుగా సమన్లు పంపారని సింగ్ పేర్కొన్నారు. ఈ కేసులో మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఈడీ మంగళవారం నమన్ బిక్సల్‌ను విచారణకు హాజరు కావాల్సిందిగా సమన్లు పంపింది.

గాలిపటం దారం మెడకు చుట్టుకొని వ్యక్తి మృతి

థానే: గాలిపటం దారం మెడకు చుట్టుకుని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మహారాష్ట్రలోని థానే జిల్లాలో చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి భివాండి నగరంలో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 304 (నిర్లక్ష్యం వల్ల మరణం) కింద నేరం నమోదు చేసినట్లు సీనియర్ ఇన్‌స్పెక్టర్ సీకే కకడే తెలిపారు. ఉల్హాస్‌నగర్‌లో నివాసముంటున్న సంజయ్ హజారే ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా గాలిపటం దారం మెడలో చుట్టుకుంది. ఈ క్రమంలో దారం గొంతుకు బలంగా రాసుకుని గొంతు కోసుకుపోవడంతో అదుపు తప్పి గోడకు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో హజారే అక్కడికక్కడే మృతి చెందినట్లు వివరించారు.

వీధి కుక్కలకు ఆహారం వేస్తున్న యువతిపైకి దూసుకెళ్లిన కారు

చండీగఢ్: చండీగఢ్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డుపై వీధి కుక్కలకు ఆహారం వేస్తున్న ఓ యువతిపైకి కారు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో యువతి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. తేజస్విత అనే 25 ఏళ్ల యువతి తన తల్లితో కలిసి ఇంటికి సమీపంలో రహదారి పక్కన కుక్కలకు ఆహారం వేస్తోంది. అదే సమయంలో అతి వేగంగా వచ్చిన కారు ఆమెపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో తేజస్విత తలకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే ఉన్న ఆమె తల్లి వెంటనే ఆసుపత్రికి తరలించింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు అక్కడే ఉన్న సీసీటీవీలో రికార్డయ్యాయి. ఘటనపై తేజస్విత తండ్రి ఓజస్వి కౌశల్.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమార్తె ఆర్కిటెక్చర్ పూర్తి చేసిందని.. యూపీఎస్సీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నట్లు చెప్పారు. తన భార్య, కుమార్తె రోజూ వీధి కుక్కలకు ఆహారం వేస్తుంటారని తెలిపారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తొమ్మిది రాష్ట్రాల్లో గెలుపే లక్ష్యం

న్యూఢిల్లీ: కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కమలనాథులు పావులు కదుపుతున్నారు. ఈ ఏడాది జరగబోయే తొమ్మిది రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2024లో జరగబోయే లోక్‌సభ ఎన్నికలకూ బృహత్ కార్యాచరణను సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇందు కోసం తాజాగా బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలను వేదికగా కమలనాథులు మల్చుకొన్నారు. వచ్చేఏడాది జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో గెలవాలంటే ఈ ఏడాది తొమ్మిది రాష్ట్రాల్లో గెలుపు కీలకమని పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా పార్టీ శ్రేణులకు స్పష్టం చేశారు. ఏ రాష్ట్రం చేజారిపోరాదని తేల్చిచెప్పారు. దేశ రాజధాని దిల్లీలో రెండు రోజులు జరిగే కార్యవర్గ సమావేశాలకు ఆయన అధ్యక్షత వహించారు. కేంద్ర మం త్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్‌తో పాటు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సహా 350 మంది ప్రతినిధులు హాజరయ్యారు. నడ్డా ప్రారంభోపన్యాసం చేస్తూ ఎన్ని కల రాష్ట్రాల్లోని ప్రజల హృదయాలను గెలుచుకునేలా కార్యక్రమాలు చేపట్టాలని సూచిం చారు. ఇప్పటివరకూ 1.30లక్షల పోలింగ్ బూత్‌లకు బీజేపీ చేరుకుందని, బల హీనంగా ఉన్న 72వేల పోలింగ్ బూత్‌లను బలోపేతం చేసుకోవాలని నడ్డా చెప్పారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో అనేక అంశాలపై తీర్మానాలు చేస్తారు.

మోదీ రోడ్‌షో: ప్రధాని మోదీ మెగా రోడ్‌షోను సెంట్రల్ దిల్లీలోని పటేల్ చౌక్ నుంచి కార్యవర్గ సమావేశాలు జరిగే ఎన్డీఎంసీ కేంద్ర కార్యాలయం వరకు నిర్వహించారు. రోడ్‌షోలో పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. రోడ్డు ఇరువైపుల నిలుచొని మోదీపై పూల వర్షం కురిపిస్తూ అనుకూల నినాదాలతో మద్దతుదారులు హోరెత్తించారు. భారీ కటౌట్లతో మోదీకి స్వాగతం పలికారు. వివిధ రాష్ట్రాల జానపద కళాకారులు ప్రదర్శనలిచ్చారు. దేశభక్తి గీతాలు కొందరు ఆలపించారు. ఇదే క్రమంలో దేశవ్యాప్తంగా పార్టీ ఇన్‌చార్జీలు, సహ-ఇన్‌చార్జీలతో సమావేశాన్ని ఎన్డీఎంసీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు.

ట్రాక్టర్ నిరసన ర్యాలీ జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ఒంగోలు:

కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ రాతపూర్వకంగా రైతు సంఘాల నేతలకు ఇచ్చిన హామీలను అమలు చేయని నేపథ్యంలో ఈ నెల 26న అన్ని జిల్లా కేంద్రాలలో నిర్వహించ తలపెట్టిన రైతుల ట్రాక్టర్ నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య పిలుపునిచ్చారు. ఒంగోలులోని ప్రెస్ క్లబ్ లో సోమవారం ప్రకాశం జిల్లా రైతు సంఘాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రావుల వెంకయ్య మాట్లాడుతూ హరియాణాలోని జుండ్ కేంద్రంగా ఈనెల 26న లక్ష ట్రాక్టర్లతో నిరసన ర్యాలీని రైతు సంఘాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో రైతులు ట్రాక్టర్ ర్యాలీలను నిర్వహించి జయప్రదం చేయాలని కోరారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా దిల్లీ కేంద్రంగా 5405 రైతు సంఘాలు అధ్వర్యంలో ఏడాది పాటు సాగిన ఉద్యమం చారిత్రాత్మకమన్నారు. దీనిని ప్రపంచం గుర్తించిందన్నారు. ఐక్యరాజ్యసమితి కూడా ఉద్యమానికి మద్దతు ఇచ్చిందన్నారు. చివరకు సుప్రీంకోర్టు కూడా కొన్ని రోజులపాటు రైతాంగ ఉద్యమాన్ని ఆపివేయాలంటూ పదేపదే కోరిందన్నారు. చివరకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ భారత జాతికి క్షమాపణలు చెబుతూ మూడు చట్టాలను రద్దు చేశారన్నారు. అయితే ఈ సందర్భంగా రాతపూర్వకంగా మోదీ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26న జరిగే ట్రాక్టర్ ర్యాలీని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. చుండూరి రంగారావు మాట్లాడుతూ... ఈ నెల 26న ట్రాక్టర్లతో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ర్యాలీలో రైతులు, రైతు కూలీలు, కౌలు రైతులు, పట్టణాలలోని అల్పాదాయ వర్గాలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులను కాలరాస్తూ 44 చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చటాన్ని కూడా రైతు సంఘాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. వెంటనే కేంద్రం తన ఆలోచన మార్చుకోవాలని, అలాగే నూతన విద్యుత్ సవరణ బిల్లులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీని, నరేంద్ర మోదీని 2024 పార్లమెంటు ఎన్నికలలో ఓడించేలా రైతాంగ ఉద్యమాలను ముందుకు నడపాలని పిలుపునిచ్చారు. 26వ తేదీన ట్రాక్టర్ ర్యాలీ దక్షిణ బైపాస్ నుంచి ఉత్తర బైపాస్ వరకు సాగుతుందని తెలిపారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ... ఇటీవల వచ్చిన తుపాను తో ప్రకాశం జిల్లాలో 11,000 ఎకరాలలో పొగాకు పంట దెబ్బతిందని, కేంద్రం వెంటనే స్పందించి బోర్డు ద్వారా పొగాకు రైతులకు పరిహారం అందించాలన్నారు. జిల్లాలోని వెలుగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులకు రూ. 1200 కోట్లు వెంటనే మంజూరు చేసి సెప్టెంబర్ నాటికి వెలుగొండ ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వర్లు, ఆచార్య రంగా కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య మాట్లాడుతూ... కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పూర్తిగా రైతు వ్యతిరేక ప్రభుత్వమని, ఉద్యమాల ద్వారానే మద్దతు ధరకు చట్టబద్ధత సాధ్యమన్నారు. ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి లలిత కుమారి, జనసేన పార్టీ రైతు విభాగం నాయకుడు పసుపులేటి హరి, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ మాబూ, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమాన్ రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పెంట్యాల హనుమంతరావు మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకు ఈ ఉద్యమం ఆగదని హెచ్చరించారు.

మాట్లాడుతున్న రావుల వెంకయ్య. వేదికపై చుండూరి రంగారావు తదితరులు

వందే భారత్ రయ్..రయ్...

అందుబాటులోకి వచ్చిన సెమీ బులెట్ రైలు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: భారతీయ రైల్వే ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు తెలుగు రాష్ట్రాల్లో పరుగులు పెడుతోంది. సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో తెలంగాణ గవర్నర్ తమిళసై సౌందర్యరాజన్, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర పర్యాటక, సంస్కృతిక శాఖ మంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. విశాఖ చేరుకున్న వందే భారత్ రైలుకు తూర్పు కోస్తా రైల్వే డీఆర్ఎం, రైల్వే ఉన్నతాధికారులు దువ్వాడలో ఘన స్వాగతం పలికారు. విద్యార్థులకు చాక్లెట్లు, స్వీట్లు పంచిపెట్టారు. దేశంలో ఇప్పటి వరకూ ఏడు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభం కానున్న ఈ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ 8వ రైలు. ఇందులో కోచ్‌లు అత్యాధునికంగా ఉంటాయి. గంటకు 180 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తాయి. ఇందులో ఆటోమేటిక్ డోర్ సిస్టమ్ ఉంటుంది. మొత్తం 16 కోచ్‌లు 1128 సీట్లు ఉంటాయి. ఇతర రైళ్లతో పోలిస్తే సమయం ఆదా అవుతుంది. వైఫై, హాట్‌స్పాట్ సౌకర్యముంటుంది. జీపీఎస్ ఆధారిత ఆడియో విజ్యువల్ ప్యాసెంజర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ అందుబాటులో ఉంటుంది. బయో వ్యాక్యూమ్ టాయ్‌లెట్స్ ప్రత్యేకత. ప్రతి కోచ్‌కు ప్యాంట్రీ సౌకర్యం ఉంటుందని రైల్వే అధికారులు తెలియజేశారు.

మధ్యతరగతి కష్టాలేంటో తెలుసు

న్యూఢిల్లీ: మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొనే కష్టాల గురించీ తనకూ తెలుసని, అదే నేపథ్యం నుంచి వచ్చానని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. మోదీ ప్రభుత్వం వచ్చాక మధ్యతరగతి వారిపై కొత్తగా పన్నులు వేయలేదని చెప్పారు. మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ముమ్ముందు పనిచేస్తుందని ఆర్ఎస్ఎస్‌కు చెందిన పాంచజన్య మ్యాగజైన్ నిర్వహించిన కార్యక్రమంలో సీతారామన్ అన్నారు. కేంద్రబడ్జెట్ ప్రవేశపెట్టనున్న వేళ ఆమె వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. బడ్జెట్‌లో మధ్యతరగతికి తాయిలాలు ప్రకటించవచ్చన్న అంచనా ఉంది. ఆదాయపు పన్ను పరిమితిని పెంచుతారని తెలుస్తోంది. సీతారామన్ మాట్లాడుతూ, 'నేను మధ్యతరగతి నుంచే వచ్చా. మధ్యతరగతి కష్టాలేంటో తెలుసు. మోదీ ప్రభుత్వం మధ్య తరగతిపై కొత్త పన్నులూ వేయలేదు. రూ.5 లక్షల వరకు ఆదాయం కలిగిన వారికి పన్నులు లేవు' అని అన్నారు. 27 నగరాల్లో మెట్రో రైల్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తున్నామని, 100 స్మార్ట్‌సిటీలు నిర్మిస్తున్నామని తెలిపారు. దేశంలో అధిక సంఖ్యలో ఉన్న మధ్య తరగతి కోసం మోదీ ప్రభుత్వం మరింత చేయబోతోందని నిర్మలా సీతారామన్ చెప్పారు. బ్యాంకింగ్ వ్యవస్థలో ప్రక్షాళన కారణంగా ఎన్‌పీఏలు గణనీయంగా తగ్గాయని చెప్పారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల పరిస్థితి మెరుగైందన్నారు. ఆయా బ్యాంకులకు రూ.2.11 లక్షల కోట్ల మూలధన సాయం అందించామని గుర్తుచేశారు. ప్రభుత్వం చేపట్టిన చర్యల ఫలితంగా 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఆయా బ్యాంకులన్నీ రూ.31,820 కోట్ల నికర లాభాన్ని ప్రకటించాయన్నారు. 2022లో రెట్టింపు లాభాన్ని పొందాయన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, దానికి అనుగుణంగా అనేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

మీడియా కౌన్సిల్ కావాలి

దిల్లీ జర్నలిస్టుల సంఘం డిమాండ్

పెరుగుతున్న ఆంక్షలపై ఆందోళన

న్యూఢిల్లీ: దేశంలో జర్నలిజానికి, జర్నలిస్టులకు స్వేచ్ఛ కరవైందని దిల్లీ జర్నలిస్టుల సంఘం ఆవేదన వ్యక్తంచేసింది. మీడియాపై పెరుగుతున్న ఆంక్షలు, పాత్రికేయులను జైళ్లలో పెట్టడం, తప్పుడు కేసుల్లో ఇరికించడం ఆక్షేపణీయమని పేర్కొంది. కోరల్లేని ప్రెస్ కౌన్సిల్ స్థానె 'మీడియా కౌన్సిల్ ఆఫ్ ఇండియా' ఏర్పాటుకు డిమాండ్ చేసింది. జర్నలిస్టులు, జర్నలిజంపై పోలీసింగ్ పెరుగుతోందని, ఇది తీవ్రంగా ఆందోళన కలిగించే విషయమని పేర్కొంది. మైనారిటీలపై విద్వేషం పెరుగుతుండటం కూడా ఆందోళనకరమని ఒక ప్రకటనను దిల్లీ జర్నలిస్టుల సంఘం (డీయూజే) పేర్కొంది. ప్రెస్ కౌన్సిల్, న్యూస్ బ్రాడ్‌కాస్టింగ్ అండ్ డిజిటల్ స్టాండర్స్ అథారిటీ (ఎన్‌బీడీఎస్‌ఏ)లను నిర్ణయరాహిత్యానికి బందీలుగా అభివర్ణించింది. వాటి స్థానంలో మీడియా కౌన్సిల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. దేశంలో పాత్రికేయులు, వార్తాసేకరణపై ఆంక్షలు పెరుగుతుండటాన్ని మానవహక్కుల నివేదిక అద్దంపట్టిందని తెలిపింది. మహమ్మద్ జుబేర్, రూపేశ్ కుమార్ సింగ్, సిద్దీఖీ కప్పన్ తదితర జర్నలిస్టులు అరెస్టులు, నిర్బంధాలను ప్రస్తావించింది. కశ్మీర్‌లో 2019 ఆగస్టు నుంచి 35 మంది జర్నలిస్టులు పోలీసుల విచారణ, తనిఖీలు, బెదిరింపులు, భౌతిక దాడులను ఎదుర్కొన్నారని, తప్పుడు క్రిమినల్ కేసుల్లో ఇరికించబడ్డారని డీయూజే పేర్కొంది. ప్రముఖ వార్తాఛానల్ ఎన్డీటీవీ అదానీ గ్రూపు వశం కావడంతో జర్నలిస్టులు వరుసగా రాజీనామా చేస్తున్నట్లు తెలిపింది. ఆ ఛానల్ స్వతంత్రంగా వార్తలు అందించేదని, ఇప్పుడు ఆ పరిస్థితి ఉండకపోవచ్చునని డీయూజే పేర్కొంది.

23 ఏళ్ల తర్వాత అజిత్‌తో ఐశ్వర్య

చెన్నై: మోడల్‌గా కెరీర్‌ను ఆరంభించి హీరోయిన్‌గా మారిన అందాల భామ ఐశ్వర్య రాయ్. రెండు దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తోంది. కెరీర్ పీక్‌లో ఉండగానే అభిషేక్ బచ్చన్‌ను పెళ్లి చేసుకుని జీవితంలో స్థిరపడింది. కొన్నాళ్ల క్రితమే ఇండస్ట్రీకి రీ ఎంట్రీ ఇచ్చింది. కొత్త రకం పాత్రలను పోషిస్తూ ప్రేక్షకులకు అలరిస్తోంది. ఈ మధ్యనే 'పొన్నియిన్ సెల్వన్' సినిమాలో కనిపించింది. తాజాగా ఈ అందాల భామకు సంబంధించిన ఓ అప్‌డేట్ మీడియాలో షికార్లు కొడుతుంది. కోలీవుడ్ స్టార్ అజిత్ కుమార్ హీరోగా విఘ్నేశ్ శివన్ ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో రూపొందించనుంది. ఈ ప్రాజెక్టు వర్కింగ్ టైటిల్‌గా 'ఏకే62' అని వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్స్‌గా నటిస్తున్నారని త్రిష, నయనతార, కాజల్ అగర్వాల్, కియారా అద్వానీతో సహా అనేకమంది పేర్లు వినిపించాయి. తాజాగా మరో స్టార్ హీరోయిన్ పేరు వినిపిస్తోంది. అజిత్‌కు జోడీగా ఐశ్వర్య రాయ్ నటించనుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం మేకర్స్ ఐష్‌తో చర్చలు జరుపుతున్నారట. ఒకవేళ ఆమె కనుక హీరోయిన్‌గా నటించడానికి అంగీకారం తెలిపితే.. అజిత్, ఐశ్వర్యల జోడీ 23ఏళ్ల తర్వాత రిపీట్ అవుతుంది. గతంలో ఈ జంట కలసి 'ప్రియురాలు పిలిచింది'లో నటించారు. ఈ చిత్రం 2000లో విడుదలైంది. బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించింది. ఈ సినిమాలోని పాటలు క్లాసిక్‌గా నిలిచిపోయాయి. 'ఏకే62' లో అరవింద్ స్వామి, సంతానం కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు.

విశాలాంధ్ర రీల్

రాజమౌళికి జేమ్స్ కామెరాన్ ప్రశంస

హైదరాబాద్: ఆర్ఆర్ఆర్'... ఈ భారతీయ, అందులోనూ ఓ తెలుగు సినిమా గురించే ప్రస్తుతం ప్రపంచం మొత్తం చర్చించుకుంటోంది. థియేటర్స్‌లో విడుదలై రూ.1200కోట్లకు పైగా కలెక్షన్లు కొల్లగొట్టిన ఈ చిత్రం... ఓటీటీలోకి వచ్చాక ఎంతోమందికి చేరువైంది. చాలామంది వివిధ దేశాల సినీ ప్రముఖులు ఈ చిత్రంపై, రాజమౌళిపై ప్రశంసలు కురిపించారు. తాజాగా ప్రపంచ దిగ్గజ, 'అవతార్' దర్శకుడు జేమ్స్ కామెరూన్ కూడా రాజమౌళిపై ప్రశంసలు కురిపించారు.

ఈ విషయాన్ని తెలుపుతూ రాజమౌళి సోషల్ మీడియాలో ఓ పోస్టు షేర్ చేశాడు. రాజమౌళి షేర్ చేసిన పోస్టులో.. 'గ్రేట్ జేమ్స్ కామెరాన్ ఈ చిత్రాన్ని చూశారు.. ఆయనకు ఈ సినిమా చాలా నచ్చింది. అందుకే ఆయన భార్యకు కూడా ఈ చిత్రాన్ని చూడమని చెప్పారు. ఆమెతో కలిసి రెండోసారి మళ్లీ చూశారు. సర్.. మీరు మా సినిమాని విశ్లేషించడానికి మాతో మొత్తం 10 నిమిషాలు గడిపారని నేను ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను. మీరు చెప్పినట్లు నేను ప్రపంచంలోనే టాప్ కాదు. ఇద్దరికీ ధన్యవాదాలు' అని రాసుకొచ్చాడు.

మరో రెండు అంతర్జాతీయ అవార్డులు

'ఆర్ఆర్ఆర్' జోరు ఇప్పట్లో ఆగేలా కనిపించట్లేదు. ఇటీవలే అత్యంత ప్రతిష్ఠాత్మక గోల్డెన్ అవార్డును దక్కించుకున్న విషయం తెలిసిందే. ఆ చిత్రంలోని 'నాటు నాటు' సాంగ్‌కు 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' అవార్డు వచ్చింది. తాజాగా ఈ చిత్రానికి మరో రెండు అంతర్జాతీయ అవార్డులు వచ్చాయి. ఉత్తమ పాట, ఉత్తమ విదేశీ చిత్రం కేటగిరీలో రెండు క్రిటిక్స్ ఛాయిస్ అవార్డులు అందుకుంది.

'నాటు నాటు' పాటకే బెస్ట్ సాంగ్ అవార్డు రావడం ఇక్కడ విశేషం. 28వ క్రిటిక్స్ ఛాయిస్ అవార్డు ఫంక్షన్‌లో రాజమౌళి, ఎంఎం కీరవాణి ఈ అవార్డులను అందుకున్నారు. ఈ మేరకు ఆర్ఆర్ఆర్ టీమ్ ఓ వీడియోను సైతం సోషల్ మీడియాలో షేర్ చేసింది. అలాగే.. ఈ విషయాన్ని తెలుపుతూ క్రిటిక్స్ ఛాయిస్ అవార్డు యాజమాన్యం సైతం ట్విట్టర్‌లో ఓ పోస్ట్‌ని షేర్ చేసింది. అందులో.. 'ఉత్తమ విదేశీ చిత్రంగా క్రిటిక్స్ ఛాయిస్ అవార్డు అందుకున్నందుకు.. చిత్ర నటీనటులు, సిబ్బందికి అభినందనలు' అని చెప్పుకొచ్చింది.

రికార్డు విజయం

- చరిత్ర సృష్టించిన టీమిండియా
- 317 పరుగుల భారీ తేడాతో గెలుపు
- శతక్కొట్టిన కోహ్లి, శుభ్‌మన్ గిల్
- వణికించిన సిరాజ్ • ఇండియా క్లీన్‌స్వీప్

విరాట్ కోహ్లి 166 నాటౌట్ (110 బంతుల్లో 13 ఫోర్లు, 8 సిక్సర్లతో)

తిరువనంతరపురం:

వన్డే క్రికెట్ చరిత్రలో టీమిండియా చరిత్ర సృష్టించింది. శ్రీలంకతో ఆదివారం జరిగిన మూడో వన్డేలో సమష్టిగా చెలరేగిన టీమిండియా 317 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో అత్యధిక పరుగుల తేడాతో గెలిచిన ఏకైక జట్టుగా భారత్ చరిత్రకెక్కింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లకు 390 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి(110 బంతుల్లో 13 ఫోర్లు, 8 సిక్సర్లతో 166 నాటౌట్), శుభ్‌మన్ గిల్(97 బంతుల్లో 14 ఫోర్లు, 2 సిక్స్‌లతో 116) శతక్కొట్టగా... కెప్టెన్ రోహిత్ శర్మ(42), శ్రేయస్ అయ్యర్(38) పర్వాలేదనిపించారు. శ్రీలంక బౌలర్లలో కసున్ రజితా, లాహిరు కుమార రెండేసి వికెట్లు తీయగా.. కరుణరత్నే ఓ వికెట్ పడగొట్టాడు. అనంతరం లక్ష్యచేధనకు దిగిన శ్రీలంక.. మహమ్మద్ సిరాజ్(4/32) ధాటికి 22 ఓవర్లలో 73 పరుగులకే కుప్పకూలింది. నువనిందు ఫెర్నాండో(19), దసన్ షనక(11), కసున్ రజిత(13 నాటౌట్) మినహా ఎవరూ డబుల్ డిజిట్ స్కోర్ చేయలేదు. భారత బౌలర్లలో సిరాజ్‌కు తోడుగా..మహమ్మద్ షమీ, కుల్దీప్ యాదవ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. అషెన్ బండార గాయం కారణంగా బ్యాటింగ్ రాలేదు. భారీ పరుగుల తేడాతో ఓ జట్టు గెలవడం ఇదే తొలిసారి. గతంలో ఐర్లాండ్‌పై న్యూజిలాండ్ 290 పరుగుల తేడాతో గెలవగా.. ఆ రికార్డును తాజాగా భారత్ అధిగమించింది. భారీ విజయంతో భారత్ చరిత్ర సృష్టిస్తే.. శ్రీలంక మాత్రం ఘోర పరాజయంతో చెత్త రికార్డును తమ పేరిట లిఖించుకుంది. భారీ లక్ష్యచేధనకు దిగిన శ్రీలంకకు సిరాజ్ ఆదిలోనే షాకిచ్చాడు. తన వరుస ఓవర్లలో ఓపెనర్ అవిష్కా ఫెర్నాండో(1), కుశాల్ మెండిస్(4)లను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే చరిత్ అసలంక(1)ను షమీ ఔట్ చేయగా.. నువనిందుఫెర్నాండో(19), వానిందు హసరంగాలను స్టన్నింగ్ డెలివరీలతో సిరాజ్ క్లీన్ బౌల్డ్ చేశాడు. కరుణ రత్నేను సిరాజ్ స్మార్ట్‌గా రనౌట్ చేయగా.. కుల్దీప్ యాదవ్ దసన్ షనక(11) క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆ వెంటనే దునిత్ వెల్లలగే(3)ను షమీ క్యాచ్ ఔట్ చేయడంతో 51 పరుగులకే శ్రీలంక 8 వికెట్లు కోల్పోయింది. లాహిరు కుమార, కసున్ రజితా కాసేపు ఆడినా.. కుల్దీప్ వారి పోరాటానికి తెరదించాడు. లాహిరు కుమారాను క్లీన్ బౌల్డ్ చేయడంతో శ్రీలంక ఇన్నింగ్స్ ముగిసింది. ఫీల్డింగ్ చేస్తూ దారుణంగా గాయపడ్డ అషేన్ బండారా బ్యాటింగ్‌కు రాలేదు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.